జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

NEWS IS RIGHT

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

https://prajapalana.com/epaper.php








సంపుటి 4 సంచిక 154 | హైదరాబాద్, మార్చి 23 మంగళవారం 2021 | 8 పేజీలు | వెల : 5.00


# ఉద్యోగులపై కేసీఆర్ వరాల జల్లు

## 30 శాతం ఫిట్‌మెంట్, 61 ఏళ్లకు రిటైర్‌మెంట్.. సీఎం కేసీఆర్ మాటల్లో..



హైదరాబాద్,మార్చి 22, ప్రజాపాలన ప్రతినిధి:తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యమంత్రి కేసీఆర్ శుభవార్త వినిపించారు. తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 30 శాతం ఫిట్‌మెంట్‌ను ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ వయసును 61 సంవత్సరాలకు పెంచుతున్నామని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. శాసనసభ వేదికగా ముఖ్యమంత్రి కేసీఆర్ పీఆర్సీపై ప్రకటన చేశారు. 30 శాతం ఫిట్‌మెంట్ ఉత్తర్వులు ఏప్రిల్ 1, 2021 నుంచి అమల్లోకి వస్తాయన్నారు. త్వరలోనే ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టి.. ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, హోంగార్డులకు, వీఆర్ఏ, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీలకు కూడా పీఆర్సీ వర్తిస్తుందని సీఎం ప్రకటించారు.

సీఎం కేసీఆర్ పీఆర్సీ ప్రకటన సారాంశం..

తెలంగాణ రాష్ట్ర సాధనలో స్ఫూర్తిమంతమైన భూమిక పోషించిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు స్వరాష్ట్ర అభివృద్ధిలోనూ అంతే నిబద్ధతతో పాలుపంచు కుంటున్నారు. వీరందరి సహకారంతో ప్రభుత్వ సంక్షేమ,అభివృద్ధి పథకాల ఫలాలు ప్రజలకు విజయవంతంగా అందుతున్నాయి. ఉద్యోగులతో ప్రభుత్వానికున్న అవినాభావ సంబంధరీత్యా తెలంగాణ ప్రభుత్వం ఎంప్లాయీస్ ఫ్రెండ్లీ ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నది. ఉద్యోగులందరి హక్కులను గౌరవిస్తున్నది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే ఉద్యమంలో ఉద్యోగులు పోషించిన పాత్రను అభినందిస్తూ తెలంగాణ ప్రభుత్వం స్పెషల్ ఇంక్రిమెంటును ప్రకటించింది. 2014లో పదవ వేతన సవరణ చేస్తూ 43శాతం అత్యధిక ఫిట్ మెంటును ప్రకటించింది. రాష్ట్రంలోని ఉద్యోగులందరి పట్ల తనకున్న అభిమానాన్ని తెలంగాణ ప్రభుత్వం ఘనంగా చాటుకున్నది.

కరోనా విపత్తు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను కుదిపేసింది. అనూహ్యంగా ఏర్పడిన ఆర్థిక లోటు వల్ల 11వ వేతన సవరణ కొంత ఆలస్యమైంది. ఆర్థిక వ్యవస్థ ఇపుడిపుడే తేరుకుంటున్న నేటి సందర్భంలో రాష్ట్రంలోని అందరు ఉద్యోగ, ఉపాధ్యాయులకు వర్తించే విధంగా మెరుగైన రీతిలో 11వ వేతన సవరణ చేస్తున్నాం.

వేతన సవరణ అంటే కేవలం ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే చేసే పద్ధతిని గత ప్రభుత్వాలు అవలంభించాయి. తెలంగాణ ప్రభుత్వం గతంలో ప్రభుత్వ ఉద్యోగులకు వేతన సవరణ చేస్తూనే, (మిగతా 2లో..)

## రాజ్యసభలో 'మహా' గందరగోళం



న్యూఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి : మహారాష్ట్ర హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్‌పై అవినీతి ఆరోపణలు రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ విషయంపై రాజ్యసభ లోనూ నేడు గందరగోళ వాతావరణం నెలకొం ది. కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్ ఈ అంశా న్ని సభలో లేవనెత్తడంతో భాజపా నేతలు నిరస నకు దిగారు. తమ సీట్ల నుంచి లేచి నినాదాలు చేశారు. అటు ఎన్సీపీ నేతలు దేశ్‌ముఖ్‌పై వచ్చిన ఆరోపణలను ఖండిస్తూ నినాదాలు చేశారు. దీంతో ఒకింత గందరగోళం నెలకొన డంతో ఛైర్మన్ సభను మధ్యాహ్నం రెండు గంట ల వరకు వాయిదా వేశారు. అటు లోక్‌సభలోనూ ఈ ప్రస్తావన వచ్చింది. 16ఏళ్ల సస్పెన్షన్‌లో ఉన్న సచిన్‌వాజేను ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం ఎలా తిరిగి విధుల్లోకి తీసుకుందని స్వతంత్ర ఎంపీ నవనీత్ రవిరాణా ప్రశ్నించా రు. భాజపా ఎంపీలు కూడా మహా సర్కారుపై విమర్శలు గుప్పించారు.

### గవర్నర్‌ను కలవనున్న బీజేపీ నేతలు

అనిల్ దేశ్‌ముఖ్‌పై అవినీతి ఆరోపణలు మహా రాష్ట్ర సంకీర్ణ ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేశా యి. వెంటనే దేశ్‌ముఖ్ రాజీనామా చేయాలని, ఈ వ్యవహారంపై దర్యాప్తు జరపాలని భాజపా డిమాండ్ చేస్తోంది. దీనిపై మార్చి 24న భాజపా ప్రతినిధుల బృందం రాష్ట్ర గవర్నర్ భగత్ సింగ్ కోశ్యారీని కలవనుంది. ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ ఇం టి ఎదుట పేలుడు పదార్థాల వాహనం కేసులో పోలీసు అధికారి సచిన్ వాజే అరెస్టు అనం తరం ఒక్కొక్కటిగా వెలుగుచూస్తున్న పరిణామా లు రాష్ట్రంలో తీవ్ర ప్రకంపనలు సృష్టిస్తున్నా యి. హోం మంత్రి ప్రతినెలా రూ.100 కోట్ల వసూళ్లను వాజేకు మిగతా 2లో..

## అత్యవసరమైతే తప్ప బయటకి రావొద్దు:ఈటల



హైదరాబాద్,మార్చి 22, ప్రజాపాలన ప్రతినిధి: రాష్ట్రంలో కరోనా పరిస్థితిపై వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో సీఎస్ సోమేశ్ కుమార్, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కరోనా అదుపులోనే ఉందని, ఆర్టీపీసీఆర్ టెస్టుల సంఖ్యను పెంచాలని అధికారులను మంత్రి ఆదేశించారు. కేసులు పెరిగితే రోగులకు సరిపడా ఆస్పత్రులను సిద్ధంగా ఉంచాలని సూచించారు. గాంధీ ఆస్పత్రి కొవిడ్ వార్డుల్లో అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు.'పీపీఈ కిట్లు, మాస్కులు, ఔషధాలు అందుబాటులో ఉంచాలి. ఇప్పటికే రోజుకు 50వేల కరోనా పరీక్షలు చేస్తున్నాం. కొవిడ్ పరీక్షల సంఖ్యను మరింత పెంచాలి. టెస్టింగ్, ట్రేసింగ్, ట్రీట్‌మెంట్ పకడ్బందీగా జరగాలి. కేసులు పెరుగుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకి రావొద్దు.' అని మంత్రి పేర్కొన్నారు.

## సూర్యాపేటలో కుప్పకూలిన స్టేడియం గ్యాలరీ..

### 100 మందికి గాయాలు



సూర్యాపేట,మార్చి 22, ప్రజాపాలన ప్రతినిధి:జాతీయ స్థాయి కబడ్డీ ప్రారంభోత్సవంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్టేడియంలోని మూడో నెంబర్ గ్యాలరీ కుప్పకూలి 100 మంది యువకులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో 20 మంది పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రికి తరలించారు. ప్రమాద సమయంలో గ్యాలరీలో 1500 మందికి పైగా ప్రేక్షకులు ఉన్నట్లు సమాచారం. ఒక్కసారిగా జరిగిన ఘటనతో అంతా ఉలిక్కి పడ్డారు. 47వ జాతీయ కబడ్డీ ఛాంపియన్‌షిప్ ప్రారంభమైన కాసేపటికే ఈ ఘటన జరిగింది. జాతీయ క్రీడల కోసం నిర్వాహకులు స్టేడియంలో మూడు గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఈఘటన జరగడంతో రెయిలింగ్ కింద పలువురు ప్రేక్షకులు ఇరుక్కుపోయారు. స్టేడియం గ్యాలరీలో సామర్థ్యానికి మించి ప్రేక్షకులు కూర్చోవడంతో ఈ ఘటన జరిగినట్లుగా తెలుస్తోంది. పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు.

## నేత్ర పర్వం.. యాదాద్రీశుడి కళ్యాణం



యాదాద్రి భువనగిరిమార్చి 22, ప్రజాపాలన ప్రతినిధి: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహా స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. యాదాద్రి కొండకింద గల పాత హై స్కూల్ గ్రౌండ్ లో ప్రారంభమైన ఈ వేడుకలు అర్చకుల వేద మంత్రోచ్చరణలు, భక్తజనుల గోవింద నామస్మరణల మధ్య కదు రమ్యంగా కొనసాగాయి. అంతకు ముందు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా.. స్వామి వారి కల్యాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మిగతా 2లో..

## ఫాస్టాగ్ ద్వారా నిత్యం రూ.100 కోట్ల వసూళ్లు!



న్యూఢిల్లీ, ప్రజాపాలన ప్రతినిధి : దేశవ్యాప్తంగా ఉన్న అన్ని టోల్‌గేట్ల నుంచి వసూలు చేస్తోన్న రుసుము రోజువారీగా సరాసరి రూ.100 కోట్ల మార్కును దాటింది. ఫాస్టాగ్ ద్వారా చేస్తోన్న చెల్లింపులు క్రమంగా పెరుగు తున్నట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 'మార్చి 16 నాటికి 3 కోట్లకు పైగా ఫాస్టాగ్‌లను జారీ చేశాము. వీటి ద్వారా మార్చి ఒకటో తేదీ నుంచి 16వ తేదీ వరకు నిత్యం సరాసరి వంద కోట్ల రూపాయలు వసూలు అవుతోంది' అని కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభలో వెల్లడించారు. టోల్‌ప్లాజాల వద్ద ఆలస్యం లేకుండా, సులువుగా రుసుము చెల్లింపులు చేసేందుకు డిజిటల్ పద్ధతి ఎంతో దోహదం చేస్తోందని, దీంతో వాహనాలు వేచివుండే సమయం గణనీయంగా తగ్గిందని స్పష్టం చేశారు. కాలుష్యాన్ని తగ్గించ డంతోపాటు టోల్ చెల్లింపుల్లో పారదర్శకత పెరిగేందుకు ఈ విధానాన్ని తీసుకువచ్చామని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇక, ఏడాదిలోగా దేశంలోని అన్ని టోల్‌ప్లాజాలను పూర్తిగా తొలగిస్తామని కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఈ మధ్యే వెల్లడించారు. వీటి స్థానంలో జీపీఎస్ ఆధారిత టోల్ వసూళ్ల వ్యవస్థను తీసుకొస్తామని పేర్కొన్నారు. జీపీఎప్ ఆధారం గా..వాహన కదలికలను బట్టి వినియోగదారు బ్యాంకు ఖాతా నుంచి నేరుగా టోల్ మొత్తాన్ని మినహాయించుకొనే కొత్త వ్యవస్థను తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నా రు. నూతన విధానం అమల్లోకి వస్తే.. వాహన దారులు జాతీయ రహదారిపై ప్రయాణించిన దూరానికే టోల్ ఛార్జీలు పడతాయని అభిప్రాయప డ్డారు. ఇదిలాఉంటే, ఫిబ్రవరి 15వ తేదీ నుంచి దేశంలోని అన్ని టోల్‌గేట్‌ల వద్ద ఫాస్టాగ్ వినియోగాన్ని కేంద్ర ప్రభుత్వం తప్పనిసరి చేసిన విషయం తెలిసిందే. ఫాస్టాగ్ లేని వాహనాల నుంచి రెట్టింపు రుసుమును వసూలు చేస్తున్నారు.

### రైతుల ఆందోళన.. 814 కోట్ల నష్టం

రైతుల ఆందోళన కారణంగా నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్‌ఏఐ)కు రూ.814.4 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ మిగతా 2లో..



## ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావాలి: సుప్రీంకోర్టు

ఢిల్లీ: ఏపీ, తెలంగాణ మధ్య తెలుగు అకాడమీ ఉద్యోగుల ఆస్తుల పంపకాలపై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఉద్యోగుల పంపకం, ఆస్తులు, అప్పులపై తెలంగాణ హైకోర్టు ఆదేశాలను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంలో సవాలు చేసింది. విభజన చట్టం 10వ షెడ్యూల్‌లోని తెలుగు అకాడమీ విభజన అంశం.. న్యాయపరిధిలోకి రాదని తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎంఆర్ షాల ధర్మాసనం విచారించింది. ప్రతివాదులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. మిగతా 2లో..




## రాజ్యసభలో 'మహా' గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

లక్ష్యంగా పెట్టారంటూ ఇటీ వలే బదిలీ అయిన ముంబయి మాజీ పోలీస్ కమిషనర్ పరమ్ వీర్ సింగ్ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేకు రాసిన లేఖ.. అధికార మహా వికాస్ అఘాడీ కూటమిని ఇబ్బందుల్లో పడేసింది. ఈ నేపథ్యంలోనే శివసేన-ఎన్సీపీ-కాంగ్రెస్ నేతలు సోమవారం సమావేశమై తదుపరి కార్యాచరణ గురించి చర్చించనున్నారని తెలుస్తోంది.

## నేత్ర పర్వం.. యాదాద్రీశుడి కళ్యాణం

(మొదటిపేజీ తరువాయి)

స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేద మంత్రోచ్చరణల మధ్య కన్యా దానం తంతు వేడుకగా జరిగింది. స్వామి వారి కళ్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరాడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది.

## ఉద్యోగులపై కేసీఆర్ వరాల జల్లు

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రస్థాయిలో సేవలందిస్తున్న ఇతర చిరుద్యోగుల అవసరాలను, స్థితిగతులను దృష్టిలో పెట్టుకొని, మానవీయ కోణంలో వారి వేతనాలను కూడా పెంచింది. ఈసారి కూడా రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు వేతన సవరణ చేస్తూ, ప్రభుత్వ యంత్రాంగంలో భాగమై పనిచేస్తున్న ఇతర కాంట్రాక్టు ఉద్యోగులు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, హెూంగార్డులు, అంగన్ వాడీలు, ఆశ వర్కర్లు, సెర్ప్ ఉద్యోగులు, విద్యా వాలంటీర్లు, కేజీబీవీ, సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు, వీ.ఆర్.ఏలు, వీ.ఏ.ఓలు, గ్రాంట్ ఇన్ ఎయిడ్, వర్కు చార్జ్ డ్, డెయిలీ వేజ్ తదితర ఉద్యోగులందరికీ వెరసి రాష్ట్రంలోని 9,17,797 మంది ఉద్యోగులకు వేతనాల పెంపుదల వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సంప్రదింపులు జరిపిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగులు కోరిన విధంగానే ప్రభుత్వం ప్రమోషన్ల ప్రక్రియను చేపట్టింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 80శాతం ఉద్యోగుల ప్రమోషన్ల ప్రక్రియ పూర్తయింది. మిగతా అర్హులైన ఉద్యోగులతోపాటు, అర్హులైన ఉపాధ్యాయులకు సంబంధించిన ప్రమోషన్ల ప్రక్రియను ప్రభుత్వం సత్వరమే ప్రారంభిస్తుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక రాష్ట్రంలోని 100శాతం అర్హులైన ఉద్యోగులందరు ప్రమోషన్లు పొందుతారు. ప్రమోషన్ల తర్వాత ఏర్పడే ఖాళీలను భర్తీ చేసే ప్రక్రియను కూడా ప్రభుత్వం త్వరలోనే ప్రారంభిస్తుంది.

పీ.ఆర్.సి. కమిటీ సూచనల మేరకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈ.హెచ్.ఎస్) నూతన విధివిధానాలను నిర్ణయించేందుకు ఉద్యోగ సంఘాలు, ప్రభుత్వ అధికారుల భాగస్వామ్యంతో స్టీరింగ్ కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది.

ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ 15శాతం ఇచ్చే అదనపు పెన్షన్ (%ూుఎఉఅశీఋశ్రీ ఇుఋుబఎ శీట ూవఅ- ంఱశీఅ%) కు ఉన్న వయో పరిమితిని 75 ఏళ్ల నుండి 70 ఏళ్లకు తగ్గించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గతంలోని ఉమ్మడి జిల్లాల సీనియారిటీ ప్రాతిపదికన యాజమాన్యాల వారీగా (%మీఋఋస్త్రవఎవత్ ఒఱంవ%) అర్హులైన ఉపాధ్యాయులందరికీ ప్రమోషన్లు, బదిలీల ప్రక్రియను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులతోపాటు, ఆ సంఖ్య పది వేలకు చేరే విధంగా అదనపు ప్రధానోపాధ్యాయ (స్కూల్ అసిస్టెంట్ల సమానస్థాయి) పోస్టులను మంజూరు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది.

వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలైన ఉద్యోగ, ఉపాధ్యాయులు ఒకే జిల్లాలో పనిచేయడానికి వీలుగా అంతర్ జిల్లా బదిలీల ప్రక్రియను ప్రభుత్వం వెంటనే ప్రారంభిస్తుంది.

తెలంగాణ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ కు చెందిన ఉపాధ్యాయులు వారి రాష్ట్రానికి తిరిగి వెళ్లేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేస్తాం.

కేజీబీవీల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి వేతనంతో కూడిన 180 రోజుల ప్రసూతి సెలవు సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

విధి నిర్వహణలో మరణించిన సీ.పీ.ఎస్.(కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం) ఉద్యోగుల కుటుంబ సభ్యులకు ఫ్యామిలీ పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

దేశవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక మాంద్యంతోపాటు, కరోనా విపత్తు విరుచుకుపడటంతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన ఒడిదుడుకులకు లోనైంది. కరోనా ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను కుప్పకూల్చింది. కేంద్ర ప్రభుత్వం విధించిన లాక్ డౌన్ తో రాష్ట్రంలో ప్రజాజీవనం స్తంభించడంతోపాటు, ఆర్థిక కార్యకలాపాలు కూడా స్తంభించిపోయాయి. కరోనా వల్ల రాబడి తగ్గి, రాష్ట్రం తీవ్రమైన ఆర్థిక లోటులో కూరుకుపోయింది. రాష్ట్రం ఆర్థికంగా క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయుల పట్ల ఉన్న ప్రత్యేక అభిమానంతో పి.ఆర్.సి.కి సంబంధించి 12 నెలల బకాయిలను చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ బకాయిలను రిటైర్మెంట్ బెనిఫిట్స్ తోపాటు, కలిపి పొందే విధంగా అవకాశం కల్పించబడుతుంది.

ఉద్యోగ, ఉపాధ్యాయుల రిటైర్మెంట్ గ్రాట్యుటీని 12 లక్షల నుంచి 16 లక్షలకు పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది.

గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి కట్టుబడి, రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల రిటైర్మెంట్ వయో పరిమితిని 61 సంవత్సరాలకు పెంచుతున్నామని సంతోషంగా ప్రకటిస్తున్నాను. అనుభవజ్ఞులైన ఉద్యోగుల సేవలు వినియోగించుకోవాలనే లక్ష్యంతో ఈ వయో పరిమితి పెంపును ప్రకటిస్తున్నాం. ఈ నిర్ణయం తక్షణం అమల్లోకి వస్తుంది.

రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ 30 శాతం ఫిట్మెంట్ ప్రకటిస్తున్నామనే శుభవార్తను తెలియజేయడానికి సంతోషిస్తున్నాను. ఈ ఉత్తర్వులు ఏప్రిల్ 1, 2021 నుండి అమల్లోకి వస్తాయి. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం అనుసరించిన విశాల దృక్పథానికి అనుగుణంగా ప్రతిస్పందించి ఉద్యోగులు కూడా విధి నిర్వహణలో మరింత అంకిత భావంతో నిమగ్నులవుతారని, ప్రజాసేవలో ఏ లోటు రాకుండా పూర్తి నిబద్ధతతో పనిచేస్తారని ప్రభుత్వం ఆశిస్తున్నది.

# ఓవర్ కాన్ఫిడెన్స్ కొంప ముంచుతుందా?

**విజయవాడ, మార్చి 22, (ప్రజా పాలన ప్రతినిధి) :** రాజకీయ పార్టీలు స్వయంకృతాపరాధాలతోనే కొంప కొల్లేరు చేసుకుంటాయి. నాయకులూ అంతే. అందుకే రాజకీయాల్లో హత్యలుండవు. ఆత్మహత్యలే అంటుంటారు. దీనికి ఎవరూ అతీతం కాదు. జగన్ మోహన్ రెడ్డి పదేళ్లనాడు కాంగ్రెసులోనే కొంత వేచి ఉంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి అయ్యి ఉండేవారు. ఈనాటి కేసులు, కేంద్రం ముందు మోకరిల్లాల్సిన పరిస్థితులు ఉండేవి కాదు. చంద్రబాబు నాయుడు బీజేపీని దూరం చేసుకోకుండా సంయమనం పాటించి ఉంటే ఇంతటి దయనీయమైన నేటి పరిస్థితులు ఉండేవి కాదు. పవన్ కల్యాణ్ తన సొంతబలం తెలుసుకుని ప్రధాన పార్టీలతో తొలి నుంచి జట్టు విడిచిపెట్టకుండా ఉంటే ఈపాటికే రాష్ట్రంలో ఒక ప్రధానమైన శక్తిగా ఆవిర్భవించి ఉండేవారు. నేతలు తమ బలాన్ని అతిగా అంచనా వేసుకుంటారు. అధికారంలో ఉన్నప్పుడు మంచి చెడ్డలు బేరీజు వేసుకోవడంలో పొరబడుతుంటారు. చాన్సు దొరికింది కదా అని ప్రత్యర్థిని ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు తాగించాలని చూస్తారు. ఫలితంగా ప్రజా మద్దతు కోల్పోతారు. ప్రత్యర్థికి సానుభూతి వచ్చేలా చేజేతులారా అవకాశం కల్పిస్తుంటారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ లో చోటు చేసుకుంటున్న పరిణామమిదే. ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడిపై నమోదైన కేసులు న్యాయసమీక్షకు నిలుస్తాయో లేదో తెలియదు. కానీ ప్రభుత్వ అత్యుత్సాహాన్ని చాటి చెబుతున్నాయి. అమరావతి రాజధానిని తరలించాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం. దానికి ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం కావడం లేదు. 29 గ్రామాల్లో ఆందోళన సాగుతోంది. నిజంగానే వికేంద్రీకరణ లక్ష్యంతో సర్కారు ముందుకు వెళ్లాలని ఆశిస్తే చకచకా నిర్ణయాలు తీసుకోవాలి. న్యాయపరమైన అవరోధాలు అధిగమిస్తూ కార్యాచరణలోకి దిగిపోవాలి. మరో మూడేళ్లు మాత్రమే సమయం ఉంది. మూడు రాజధానుల కలను సాకారం చేసి ప్రజలకు ఫలితాలను అందివ్వాలి. అప్పుడే ప్రభుత్వంపై విశ్వాసం పెరుగుతుంది. అమరావతిని ప్రజారాజధానిగా అభివర్ణించిన చంద్రబాబు నాయుడు ప్రజలు తనకిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేదు. గ్రాఫిక్ డిజైన్లతో స్వర్గాన్ని ఆవిష్కరిస్తున్నట్లు ప్రజలను కలల్లో తేలియాడించాలనుకున్నారు. ఒక శాశ్వత నిర్మాణం కానీ, ఐకానిక్ భవనం కానీ నిర్మించలేదు. దాంతో ప్రజలు చంద్రబాబు పై విశ్వాసం కోల్పోయారు. జగన్ ను గెలిపించారు. ఇప్పుడు మూడు రాజధానులంటూ జగన్ మరో కల కంటున్నారు. దానిని సాకారం చేయకపోతే చంద్రబాబు తరహాలోనే ప్రజావిశ్వాసం దెబ్బతింటుంది. సమర్థుడైన నాయకుడు తాను చేయదలచుకున్న పనిపై దృష్టి పెట్టాలి. గతంలో జరిగి పోయిన పనులను నిరంతరం తవ్వి పోయడం అనవసరం. చంద్రబాబు నాయుడిపై కక్ష సాధింపునకు దిగడం అవివేకంఅధికార పార్టీ శృతి మించి వ్యవహరిస్తే ప్రజలు ప్రతిపక్షం పట్ల సానుభూతి పెంచుకుంటారు. గతంలో జగన్ మోహన్ రెడ్డిపై కాంగ్రెసు, తెలుగుదేశం న్యాయస్థానాల వ్యాజ్యాలతో ఇబ్బంది పెట్టాలని చూశాయి. ఫలితంగా జగన్ కు ప్రజల్లో ఎనలేని క్రేజ్ వచ్చింది. సింపతీ వెల్లువెత్తింది. అధికారానికి బాటలు పరిచింది. వైసీపీ తరపున ఎన్నికైన ఎమ్మెల్యేలను టీడీపీలో చేర్చుకుని జగన్ మోహన్ రెడ్డిని నిర్వీర్యం చేయాలని చంద్రబాబు యోచించారు. ఫలితం ప్రజలు చెంపపెట్టులాంటి తీర్పునిచ్చారు. కొన్ని నిర్ణయాల మంచి చెడ్డలను ప్రజలకు వదిలేయాలి. చట్టం చేతిలో ఉంది కదా అని చర్యలకు దిగితే అది రివర్స్ అయ్యే ప్రమాదం ఉంది. చంద్రబాబు నాయుడికి ప్రజల్లో రాజకీయ స్వార్థపరుడనే నెగటివ్ ముద్రతో పాటు ఒక రకమైన పాజిటివ్ ఇమేజ్ కూడా ఉంది. దూరదృష్టి కలిగిన నేతగా ఆయనకు మంచి మార్కులే పడుతుంటాయి. 2014లో జగన్ మోహన్ రెడ్డికి ప్రజల్లో ఎంతో పలుకుబడి ఉంది. గెలవాల్సిన సందర్భమే. అయినప్పటికీ రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ను ఒక దారికి తెచ్చేందుకు అనుభవజ్ఞుడైన చంద్రబాబు అవసరమని ప్రజలు విశ్వసించారు. అందుకే జగన్ ను కాదని , చంద్రబాబుకు అధికారం అప్పగించారు. ఆ స్థాయి నాయకుడి పట్ల ప్రభుత్వం అనుచితంగా వ్యవహరిస్తోందనే భావన కలిగితే వైసీపీకే నష్టం. రాజకీయ పార్టీగా మేలు చేయదు. పంచాయతీ, మునిసిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షాలు డీలా పడ్డాయి. నైతిక స్థైర్యం దెబ్బతింది. కొంతకాలం పాటు మౌనాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. ఆ స్తబ్ధత నుంచి ప్రభుత్వమే బయటపడేస్తోంది. మళ్లీ సర్కారుపై పోరాటానికి ప్రతిపక్ష నేతపై కేసులు ఆస్కారం కలిగిస్తున్నాయి. తాడిపత్రిని మినహాయించి,మొత్తం నగరపాలక, పురపాలక సంస్థలన్నిటిలోనూ అధికారపార్టీ విజయం సాధించడం చరిత్రాత్మకమే. అంతమాత్రాన ప్రతిపక్షాల పని అయిపోయిందనుకోలేం. లభించిన ఓట్ల శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే తెలుగుదేశం పట్టణాల్లో తన స్థిర ఓటు బ్యాంకును కాపాడుకుందనే చెప్పాలి. అధికార పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో 51 శాతం ఓట్లు సాధించింది. ప్రస్తుతం మరో ఒకటిన్నర శాతం ఓట్లను మాత్రం పెంచుకోగలిగింది. అధికారంలో ఉండటం వల్ల అడ్వాంటేజ్ కు తోడు సామదాన భేద దండోపాయాలు ఎలాగూ ఉంటాయి. అందువల్ల పది శాతం వరకూ జనరల్ ఓటింగులో తేడా వస్తుందని అంచనా. తెలుగుదేశం పార్టీ గత శాసనసభ ఎన్నికల్లో 39 శాతం ఓట్లు తెచ్చుకుంటే ఇప్పుడు 30 శాతానికి పరిమితమైంది. తొమ్మిది శాతం ఓట్లు కోల్పోయింది. అప్పట్లో అధికారంలో ఉన్న కారణంగా పసుపు కుంకుమ, ఇతర ప్రలోభాలతో పది పన్నెండు శాతం ఓటింగును తనకు అనుకూలంగా మలచుకున్నట్లుగా ఒక అనధికార అంచనా. నిజానికి టీడీపికి శాశ్వత ఓటు బ్యాంకు గడచిన 20 ఏళ్లలో 25 నుంచి 28 శాతం మాత్రమే. మిగిలినవి పరిస్థితులు కారణంగా ఇతర పార్టీల మద్దతు, న్యూట్రల్, స్వింగ్ ఓటర్ల మార్పుతో లభిస్తున్నాయి. దీనిని బట్టి చూస్తే అధికారపార్టీ ఎన్నికలుగా ప్రయత్నించినా టీడీపీ తన ఓటు బ్యాంకును ఈ సారి కూడా నిలుపుకోగలిగింది. అదే విధంగా జనసేన, బీజేపీ శాసనసభ ఎన్నికల్లో తమకు లభించిన ఏడు శాతం ఓటింగును కలిసికట్టుగా నిలుపుకున్నాయి. జనసేనకు 4.5 శాతం, బీజేపీకి 2.5 శాతం వరకూ లభించాయి. మొత్తమ్మీద చూస్తే వైసీపీ పీక్ స్థాయి పర్ ఫామెన్స్ చూపగలిగింది. ఇది ఇక తగ్గడమే తప్ప పెరగడం ఉండదు. సాధారణ ఎన్నికల నాటికి ప్రతిపక్షాలు ఇంకా పుంజుకునే అవకాశాలున్నాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని అధికారపార్టీ పాలననే ప్రధాన కర్తవ్యంగా తీసుకుంటూ ముందడుగు వేయడం మంచిది. చిల్లరమల్లర వ్యవహారాలతో ప్రతిపక్షాలకు అవసర ప్రచారం కల్పించడం రాజకీయ నష్టాన్ని కొని తెచ్చుకోవడమే అవుతుంది.

## టీడీపీ సవాల్ గా తిరుపతి ఉపఎన్నిక

**తిరుపతి, మార్చి 22, (ప్రజాపాలన ప్రతినిధి) :** తిరుపతి లోక్సభ స్థానానికి ఈనెల 17న జగరనున్న ఉపఎన్నిక ప్రధాన ప్రతిపక్షం తెలుగుదేశం పార్టీకి సవాల్గా మారింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో పరాజయం పాలవడమనేది ఈ ఉప ఎన్నికల్లో ఏమేరకు ఓటర్లపై ప్రభావం చూపుతుందనేది ఆ పార్టీ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. టీడీపీ కన్నా ఆ పార్టీ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్న పనబాక లక్ష్మికి ఈ ఎన్నిక మరింత సవాల్ గా మారింది. 2019 ఎన్నికల్లో పోటీచేసి 2 లక్షల పైచిలుకు ఓట్ల తేడాతో ఓటమిపాలయ్యారు. ఆ తర్వాత నియోజకవర్గం మొహం చూడలేదనే అపప్రదను ఎదుర్కొంటున్నారు. నిజానికి ఎన్నికల్లో ఓడిపోయినా నిత్యం ప్రజల్లో ఉండటమనేది నాయకులకు అత్యంత అవసరం. అప్పుడే వారి ఓటు బ్యాంకు పదిలంగా ఉంటుంది. పనబాక లక్ష్మి మాత్రం మళ్లీ ఐదేళ్లకు ఎన్నికలు.. అప్పుడు చూసుకుందాంలే అనుకున్నారు. ఫలితంగా ఇటు నియోజకవర్గానికి, అటు పార్టీకి దూరమై రెండిటికీ చెడ్డ రేవడిగా మారారు.సిట్టింగ్ ఎంపీ బల్లి దుర్గాప్రసాదరావు మృతిచెందడంతో రెండేళ్లలోనే ఇక్కడ ఉప పోరు రావడం.. టీడీపీ అధినేత చంద్రబాబు తిరిగి పనబాకకే ఇక్కడ సీటు కేటాయించడం చకచకా జరిగిపోయాయి. సీటు కేటాయించినప్పుడు పనబాక లక్ష్మి కూడా ఉత్సాహంగా ప్రచారం ప్రారంభించేశారు. ఆ తర్వాత వచ్చిన స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు చూసి ఏమీ పాలుపోని స్థితిలో పడ్డారు. ఇప్పుడు క్షేత్రస్థాయిలో పరిస్థితిని గమనించిన తర్వాత ఆమెలో ఆందోళన మొదలైందటున్నారు పరిశీలకులు. గెలవగలమా? లేదా? అనవసరం డబ్బులు ఖర్చుపెట్టడం ఎందుకు లాంటి ఆలోచనలను చుట్టుముట్టాయని, పనబాక అంతర్మథనంలో పడ్డారని తెలుగు తమ్ముళ్లు చెబుతున్నారు. వీరంతా సహకరిస్తారో లేదో అనే బెంగ ఒకవైపు.. పార్టీకి స్థానికంలో ఎదురైన పరాభవం మరోవైపు ఆమెను కుదురుకోనీయకుండా చేస్తున్నాయని సమాచారం.అదే సమయంలో ఇన్నాళ్లుగా తాను పార్టీకి దూరంగా ఉండడం, నియోజకవర్గాన్ని పట్టించుకోకపోవడం కూడా ఆమెకు మైనస్ అయ్యాయి. గత రెండు ఎన్నికల్లో ఓడిపోతూ వచ్చారు. ఇప్పుడైనా ఇక్కడ గెలిచి తీరకపోతే తనపై ఐరన్ లెగ్ అనే ముద్ర పడుతుందనే భయం కూడా పనబాకను వెంటాడుతోంది. మూడోసారి ముచ్చటగా ఓటమిపాలైతే రాజకీయ జీవితానికి ఫుల్ స్టాప్ కూడా పడనుంది. ఇన్ని పరిస్థితుల నేపథ్యంలో పనబాక ఏవిధంగా రాణించగలరో చూడాలి. తెలుగుదేశం పార్టీ గెలవడం ఎంత అవసరమో.. పనబాక లక్ష్మి గెలవడం ఆమెకు అంతే ముఖ్యమన్నది వాస్తవం.

## గులిగిందాల లావణ్య గెలుపు విజయోత్సవ అభినందన సభ



**విశాఖపట్నం మర్చి 22 ప్రజాపా లన ప్రతినిధి :** గ్రేటర్ విశాఖ పశ్చిమ నియోజకవర్గం 58 వార్డు విజేతలలును వణికించిన వైకాపా కార్పొరేటర్ గులిగిందాల లావణ్య గెలుపు విజయోహెూత్సవ అభినందన సభ ప్రగతి పరుగులు పెట్టేలా మన ప్రియతమా ముఖ్యమంత్రి ప్రతి ఇంటికి ఇంటికి సంక్షేమ పతకాలు మా విజయానికి కారణం, ఈ యొక్క కార్యక్రమంలో ముఖ్యఅతిథి మాజీ ఎమ్మెల్యే పశ్చిమ నియోజకవర్గం సమన్వయ కర్త డా,, మళ్ళా విజయప్రసాద్, 58 వార్డు అధ్యక్షులు మాట్లాడుతూ ప్రజలు సమస్య లును వార్డు సమస్యలు పరిష్కరించాల చర్యలు తీసికోవాలి చెప్పారు

ఈ కార్యక్రమం కు సభ అధ్యక్షులు గులిగిందాల కృష్ణ సత్యనారాయణ రెడ్డి, పొడుగు రాజు, రమణి, వర్మ, పెద్దాడ రమణ, సోమరాజు, దర్మాల వేణుగోపాల్ రెడ్డి, సల్మాన్ రాజు, వార్డు నాయుకులు కార్యకర్తలు అభిమానులు శ్రేయోభిలాషి లు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమం ను జయప్రధం చేశారు

## కొత్త పల్లి గీత రాజకీయ సన్యాసం

**అరకు, మార్చి 22, (ప్రజాపాలన ప్రతినిధి) :** కొత్తపల్లి గీత. ప్రస్తుతం దాదాపు అందరూ మరిచిపోయిన పేరు. 2014లో అరకు ఎంపీగా వైసీపీ టికెట్పై విజయం సాధించిన కొత్తపల్లి గీత కనీసం జగన్కు మొహం కూడా చూపించకుండా.. తిరుగుబాటు బావుటా ఎగరేసిన నాయకురాలు. తర్వాత కాలంలో అప్పటి అధికార పార్టీ టీడీపీతో చెలిమి చేయాలని అనుకున్నా.. పరిస్థితులు అనుకూలించక దూరంగా ఉండిపోయారు. ఇక, తర్వాత పరిస్థితుల నేపథ్యంలో గత ఎన్నికల సమయంలో సొంతగా పార్టీ పెట్టుకున్నారు. తనతో పాటు కొందరిని పార్టీలో చేర్చుకుని టికెట్లు కూడా ఇచ్చారు. ఆ ఎన్నికల్లో ఆమె వైజాగ్ ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ నేపథ్యంలో వెంటనే వెళ్లి బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు.ఇంత వరకు బాగానే ఉంది. మరి ఇప్పుడు ఏం చేస్తున్నారు ? బీజేపీలో అయినా కుదురుగా ఉన్నారా ? రాజకీయంగా యాక్టివ్గా ఉన్నారా ? అంటే.. అసలు ఆమె బీజేపీలో ఉన్నట్టు ఆ పార్టీ నేతలకే క్లారిటీ లేకపోవడం చిత్రంగా ఉంది. తాజాగా ఏపీలో బీజేపీ ఎదగాలని భావిస్తోంది. ఇతర పార్టీల్లో గతంలో ఓ వెలుగు వెలిగిన వారిని.. మాజీలకు కండువాలు కప్పేస్తోంది. ముఖ్యంగా గిరిజన నాయకుల కోసం పార్టీ నేతలు ఎదురు చూస్తున్నారు. ఇతర పార్టీల్లో ప్రయార్టీ లేకుండా ఎవరు ఖాళీగా ఉన్నారో ? చూస్తూ వాళ్లకు కాషాయ కండువాలేస్తోంది.ఈ క్రమంలో సొంత పార్టీలోనే ఉన్న అరకు మాజీ ఎంపీ కొత్తపల్లి గీత పార్టీలోనే ఉన్నప్పటికీ.. ఎవరూ ఆమెకు ప్రాధాన్యం ఇవ్వలేదు. కాదుకాదు.. అసలు ఆమే ఎవరినీ పట్టించుకోవడం లేదు. కొన్నాళ్లు కేంద్రంలో చక్రం తిప్పుతానని.. కొన్నాళు రాష్ట్రంలో చక్రం తిప్పుతానని ప్రకటించుకున్న ఈ లేడీ ఫైర్ బ్రాండ్? కొత్తపల్లి గీత గతంలో డిప్యూటీ కలెక్టర్గా పనిచేసి.. హైదరాబాద్లో ల్యాండ్ వివాదంలో పీకల్లోతు చిక్కుకున్నారు. ఈ వివాదం నుంచి బయట పడేందుకే ఆమె బీజేపీ పంచన చేరారనే ప్రచారం కూడా ఉంది.ఇక, గత ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత.. ఇప్పటి వరకు మళ్లీ కొత్తపల్లి గీత లైవ్లోకి ఏ సందర్భంలోనూ రాకపోవడం గమనార్హం. అసలు మాజీ కేంద్ర మంత్రి పురందేశ్వరి లాంటోళ్లే బీజేపీకి పట్టడం లేదు. ఇక కొత్తపల్లి గీతను పట్టించుకునే తీరిక రాష్ట్ర నాయకత్వానికే ఉండకపోవచ్చు.

## ఫాస్టాగ్ ద్వారా నిత్యం రూ.100 కోట్ల వసూళ్లు!

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. పంజాబ్, హరియాణా, రాజస్థాన్ రాష్ట్రాల పరిధిలో టోల్ప్లాజాల వద్ద చెల్లింపులు నిలిచిపోవడం వల్ల ఈ నష్టం జరిగిందని చెప్పారు. పంజాబ్లో రూ.487 కోట్లు, హరియాణాలో రూ.326 కోట్లు, రాజస్థాన్లో రూ.1.40 కోట్లు చొప్పున నష్టం వాటిల్లిందని, ఇతర రాష్ట్రాల్లో ఎలాంటి నష్టమూ జరగలేదని చెప్పారు. టోల్ చెల్లింపులు పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆయా రాష్ట్రాల అధికారులకు సూచించామని గడ్కరీ వివరించారు.

### ఇరు రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి రావాలి: సుప్రీంకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

రెండు రాష్ట్ర ప్రభుత్వాలు విభజనపై ఏకాభిప్రాయానికి రాకపోతే.. కేంద్రం జోక్యం చేసుకునేలా చట్టంలో ఉందని తెలంగాణ తరపు న్యాయవాది వైద్యనాథన్ వాదించారు. ఇరు రాష్ట్రాలు నెల రోజుల్లో తెలుగు అకాడమీ విభజనపై ఏకాభిప్రాయానికి రావాలని సుప్రీంకోర్టు సూచించింది. తెలుగు అకాడమీ విభజనపై ఏకాభిప్రాయానికి రాకపోతే అప్పుడు విచారణ చేపడతామని సుప్రీంకోర్టు పేర్కొంది.







# నిషేధిత మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : డీఎస్పీ విజయ భాస్కర్ రావు



**నరసరావుపేట, ప్రజాపాలన ప్రతినిధి :** నిషేధిత మత్తు పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ విజయ భాస్కర్ రావు అన్నారు. యువత ,విద్యార్థులు, రోజువారి కూలీలు మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దని డిఎస్పి పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో మత్తుపదార్థాల వినియోగాని కి వ్యతిరేకంగా ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యాంటీ డ్రగ్ వీక్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నుంచి శనివారం వరకు మత్తు పదార్థాల వినియోగ వ్యతిరేకత పై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని డి.ఎస్.పి తెలిపారు. మత్తుపదార్థాల వినియోగం ద్వారా వచ్చే ఆరోగ్య సమస్యలతో జీవితాలు నాశనమైపోతాయని, నిషేధిత మత్తు పదార్థాలు కలిగి ఉన్న అమ్మిన చట్టరీత్యా నేరమని పోలీసు కేసుల బారిన పడతారని తెలిపే విధంగా ర్యాలీలు నిర్వహించబడతాయన్నారు. ప్రతిరోజు కళాశాల పాఠశాల విద్యార్థుల ర్యాలీల ద్వారా వివిధ శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసైన జీవితాలను కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడిన సంఘటనలు చోటు చేసుకోకూడదని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలవ్వద్దు, జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో 1 టౌన్ సిఐ ప్రభాకర్,2 టౌన్ సిఐ కృష్ణయ్య ,రూరల్ సిఐ అచ్చయ్య,ఎస్ ఐ లు సిబ్బంది పాల్గొన్నారు.

# మా సమస్య తీర్చండి



**గోనెగండ్ల, ప్రజా పాలన న్యూస్:** మండల కేంద్రమైన గోనెగండ్లలోని శ్రీ రామ్ కాలనీ సీతారాముల గుడి ప్రాంగణం ముందుగల రహదారి సమస్య తీర్చాలని గౌరవనీయులైన గోనెగండ్ల గ్రామ సర్పంచ్ పూజారి హేమావతి చంద్రశేఖర్ కి కాలనీకి సిసి రోడ్లను మంజూరు చేయవలసిందిగా కోరుతూ వినతిపత్రం ఇచ్చారు ఈ కార్యక్రమంలో నాగరాజు మాట్లాడుతూ పోయిన సంవత్సరం నడవటానికి వీలు కలిగేలా మట్టి గరుసును వేయించాము కానీ భారీ వర్షాలకు మట్టి అంత కొట్టుకుపోయినది అందుకని సీసీ రోడ్డు వేయాలని అన్నారు ఈ కార్యక్రమంలో దాసరి నాగరాజు మునీర్ బాషా కంసాలి పంచముఖి ఆదోని పెద్ద శంకర్ తదితరులు పాల్గొన్నారు

## జలశక్తి అభయన్ కార్యక్రమంలో నూతన సర్పంచులు




**రాజుపాలెం, ప్రజాపాలన ప్రతినిధి :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అధికారులు అందరితో ప్రతిజ్ఞ చేయించారు, అలానే నీటి సంరక్షణ కార్యక్రమంపై నూతనంగా ఎన్నిక కాబడిన గ్రామ సర్పంచులకు పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం సోమవారం ఎంపీడీవో శ్రీనివాసరావు నిర్వహించారు, ఈ సందర్భంగా ఎంపిడిఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ వర్షపు నీటిని నిల్వ చేయటం వలన భూమిలో భూగర్భ జలాలు పెరుగుతాయి అన్నారు, తహసీల్దార్ కె నగేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకుడు గుంతలు ప్రతి ఒక్కరూ ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు, ఈకార్యక్రమంలో స్పెషల్ ఆఫర్ విభుషణ రావు , శిశు సంక్షేమ శాఖ అధికారి సులోచన, విద్యాశాఖ అధికారి మల్లికార్జున శర్మ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ, హౌసింగ్ ఏఈ రాంబాబు, పంచాయతీ రాజ్ డి ఈ వీరస్వామి, ఎపిఓ సునీత, ఉపాధి హామీ ఎపియం ఏడుకొండలు , గ్రామ సర్పంచ్ లు పంచాయతీ కార్యదర్శిలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పౌష్టికాహారం తోనే ఆరోగ్యం :డాక్టర్ శ్రీనివాస్ నాయక్



**పొన్నూరు, ప్రజాపాలన ప్రతినిధి :** గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలని తద్వారా తల్లి పిల్ల ఆరోగ్యంగా ఉంటారని ఈమని ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ శ్రీనివాస నాయక్ పేర్కొన్నారు.సోమవారం దుగ్గిరాల మండలం ఈమని గ్రామంలోని ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో గర్భిణీలకు బీపీ ,షుగర్ ,హిమో గ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఉద్దేశించి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గర్భం దాల్చిన. స్త్రీలు నిత్యం సంతోషంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. దీంతో పుట్టబోయే శిశువు కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆరోగ్యమైన శిశువు కొరకు పౌష్ఠిక ఆహారం: పాలు, పండ్లు, ఆకు కూరలు ,పప్పు, మాంసము ,చేపలు తీసుకోవాలని సూచించారు.క్రమం తప్పకుండా చెకప్ చేయించుకోవాలని చెప్పారు. కాల్షియం వంటి మాత్రలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇన్నారావు ,శైలజ ,భవాని శ్రీనాధ్ పాల్గొన్నారు.

## అర్వపల్లి గ్రామంలో రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి వై రాధాకృష్ణ



**నరసరావుపేట. ప్రజాపాలన ప్రతినిధి :** వ్యవసాయ నల్ల చట్టాలు రద్దు చేయాలని , విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల చేయాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ రేట్లు తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 26 న భారత్ బంద్ జరుగుతుంది . ఈ బంద్‌ను జయప్రదం చేయాలని నరసరావుపేట మండలంలో గురవాయపాలెం, గోనేపూడి, పమిడిమర్రు ,అరవపల్లి గ్రామాల్లో రైతు సంఘం నాయకులు పర్య టించి రైతులతో సమావేశాలు నిర్వ హించారు. ఈ సందర్భంగా 23వ తేదీ భగత్ సింగ్, సుఖదేవ్, రాజ గురు వర్ధంతి సందర్భంగా నరస రావుపేటలో సాయంత్రం 4 గంట లకు ప్రకాష్ నగర్ లోనీ షా దీ ఖా నా లో రైతు విప్లవ దినోచ్ఛవ సభ జరుగుతుంది. సభలో మాజీ వ్యవ సాయ మంత్రి , రైతు సంఘాల సమన్వయ కమిటి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రిశ్వరావు గారు ఉపన్యసిస్తారు.లి రైతులంతా అధిక సంఖ్య లో పాల్గోనాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కామినేని రామారావు, కోండ్రు ఆంజనేయులు, బోసు పాల్గొన్నారు.

## జలశక్తి అభియాన్‌పై ప్రజలలో అవగాహన పెంచాలి

**వేటపాలెం, ప్రజాపాలన ప్రతినిధి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జలశక్తి అభియాన్ పై ప్రజలలో అవగాహన పెంపొందించాల్సిన బాధ్యత గ్రామ వాలంటీర్ల పై ఉందని జాయింట్ కలెక్టర్ (ఆసరా) కె.కృష్ణవేణి అన్నారు. సోమవారం స్థానిక పంచాయితీ కార్యాలయాన్ని ఆమె సందర్శించి జల శక్తి అభియాన్ కార్యక్రమంలో వాలంటీర్ల పాత్ర ముఖ్యమైనదిగా అభివర్ణించారు. తహసిల్దారు కె. ఎల్. మహేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, పంచాయితీ ప్రత్యేక అధికారి శేషయ్య, సచివలయ, పంచాయితీ సిబ్బంది. గ్రామ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# జల శక్తి అభియాన్ పై అవగాహనా ర్యాలీ




**వేటపాలెం, ప్రజాపాలన ప్రతినిధి:** జల శక్తి అభియాన్ కార్యక్రమం పై ప్రజలలో అవగాహన పెంపొందించాలని మండల ప్రత్యేక అధికారి, చేనేత జౌళి శాఖా ఉపసంచాలకులు శ్రీనివాసరావు అన్నారు. సోమవారం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జల శక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా వేటపాలెం పంచాయితీ కార్యాలయం నుండి నీటి పొదుపు, వర్షపు నీటిని ఒడిసి పట్టడం, చెట్లు పెంచటం వంటి, జల సంరక్షణ వంటి అంశాలను నినదిస్తూ ర్యాలి నిర్వహించారు. అనంతరం జల సంరక్షణ ప్రతిజ్ఞ చేశారు. వేటపాలెం రైతు భరోసా కేంద్రం నందు ప్రధాన మంత్రి ప్రసంగాన్ని లైవ్ లో ప్రదర్శించారు. కార్యక్రమంలో చెట్లు పెంచటం క్షేమం, లేకుంటే క్షామం అనే నినాదాలతో పురవీదులలో నిర్వహించిన ర్యాలిలో నినదించారు. కార్యక్రమంలో ఎంపిడివో కె. నేతాజి, ప్రత్యేక అధికారి శేషయ్య, పంచాయితీ కార్యదర్శి బెల్లకొండ ప్రసాద్, ఉపాది హామీ పదకం ఏ పి ఓ సుధారాణి, సచివాలయ సిబ్బంది, విఆరోఓలు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'శ్రీ సద్గురు మహాత్మా బడేసాహెబ్ తాత 327 ఊరుసు





**గోనెగండ్ల పజాపాలన ప్రతినిధి :** గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామం లో సుమారు 327 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన భక్తులకు ఇష్టదైవంగా మహిమాన్వితుడు గా మత సామరస్యానికి ప్రతీకగా కుల మతాలకతీతంగా భక్తులచే పూజలు అందుకుంటూ "కోరి మొక్కిన వారికి కొంగు బంగారంగా" "శ్రీ శ్రీ శ్రీ సద్గురు మహాత్మా బడేసాహెబ్ తాత స్వాముల"వారి సజీవ సమాధి మహారాజ యోగిగా గంజహళ్లి దర్గా దివ్య సన్నిధానం లో వెలసి ఉన్నారు. అలాగే కులమతాలకు అతీతంగా తన శిష్య వర్గాన్ని విస్తరించారు... ఇలా ఉండగా తన వైవాహిక జీవితంలో కూడా ఓకే యువతిని ఆమె మూడు జన్మలో కూడా శ్రీ స్వాములవారి పరిణయ మాడి, తెర్నేకల్ కొండ మాధవ స్వామి వరంతో పుత్ర సంతానమైన "శ్రీ ఉస్సేన్ సాహెబ్" పొందినారు.. గ్రామంలో శ్రీ హుస్సేన్ సాహెబ్ ద్వారా బిందు సంతతి పెంపొంది ప్రస్తుతం ఏడవ తరంవారు దర్గా పీఠాధిపతులుగా వంశపారంపర్యంగా కొనసాగుతూ ప్రతి సంవత్సరం ఫాల్గుణ శుద్ధ సప్తమి రోజున శ్రీ స్వాములవారి ఉరుసు మహోత్సవం నిర్వహిస్తున్నారు. గంజహళ్లి గ్రామంలో శ్రీ స్వాముల వారి అనుమతి కట్టుబాట్లు మేరకు. గ్రామంలో పాలు అమ్మ రాదు మరియు కొనరాదు. గోవధ నిషేధం గ్రామ పొలిమేరలో చెరుకు పండించే రాదు... పశుగ్రాసం ఎవరు తగలబెట్టే రాదు...వంటి పలు ఆచారాలను ఇప్పటికీ గ్రామం మొత్తం పాటిస్తూ శ్రీ స్వాముల వారి ఆదేశాలను తుచ తప్పకుండా ఆచరిస్తూ ప్రతి సంవత్సరం ఘనం గా జరుపుకుంటున్నారు. ఈ కార్య క్రమానికి ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు అలాగే మాజీ ఎంపీ బుట్ట రేణుక మాజీ ఎమ్మె ల్యే జయనాగేశ్వర రెడ్డి, కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి,ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, స్వామి వారిని దర్శించుకున్నారు










ప్రజాపాలన
సంపాదకీయం
మంగళవారం 23 మార్చి 2021

# బెంగాల్ ఎన్నికలపై కేంద్ర ప్రభావం

అయిదు రాష్ట్రాలు సహా ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్నికల ప్రకటన అందరూ ఊహించినదే. దక్షిణాదిన తమిళనాడు, కేరళ, కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ఒకే దఫా ఏప్రిల్ 6న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు చోట్ల కలిపి మొత్తం 404 (తమిళనాడు 234, కేరళ 140, పుదుచ్చేరి 30) అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. మిగిలిన రెండు రాష్ట్రాల్లో ఒకటైన పశ్చిమ బెంగాల్ ఎనిమిది దశల్లో ఎన్నికల నిర్వహణకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది.

ఈ తూర్పు రాష్ట్రంలో మొత్తం 294 స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో ఇదే పెద్దది కావడం గమనార్హం.

ఇక్కడ మార్చి 27న మొదటి దశ ప్రారంభమవుతుంది. ఆ తరువాత ఏప్రిల్ 1,6,10,17,22, 26,29 తేదీల్లో రెండు, మూడు, నాలుగు, అయిదు, ఆరు, ఏడు, ఎనిమిది దశల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఇక మిగిలిన ఈశాన్య భారతంలోని అసోంలో 126 సీట్లకు మూడు దశల్లో (మార్చి 27, ఏప్రిల్ 1, 6 తేదీల్లో ఎన్నికలు నిర్వహిస్తారు. స్థూలంగా చూస్తే ఎన్నికల ప్రకటనలో ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు కనపడవు. కానీ లోతుగా తరచి చూస్తే ఎన్నికల షెడ్యూల్ ప్రకటనలో కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) ఒకింత మేరకు కేంద్ర ప్రభుత్వ ప్రభావానికి గురైనట్లు కనపడుతుంది. ఈ అభిప్రాయాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం.

ఇతర రాష్ట్రాలు ఎలా ఉన్నప్పటికీ తమిళనాడు, బెంగాల్ షెడ్యూల్ ప్రకటన చూసిన తరవాత ఈ అనుమానం బలపడక మానదు. 234 స్థానాలున్న తమిళనాడులో ఏకకాలంలో ఏప్రిల్ 6న ఎన్నికల నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సీఈసీ అంతకన్నా 60 సీట్లు ఎక్కువున్న బెంగాల్ లో ఎందుకు 8 దశలకు వెళ్లిందన్న ప్రశ్నకు సరైన సమాధానం దొరకదు. ఈ విషయంలో కేంద్రం ప్రభావానికి సీఈసీ లోనైందన్న విమర్శ, ఆరోపణ, అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇందులో సహేతుకత లేకపోలేదు.

కేంద్రంలో చక్రం తిప్పుతున్న బీజేపీ ఈ దఫా బెంగాల్లో పాగా వేసేందుకు పట్టుదలతో పోరాడుతోంది. అక్కడి మమతా సర్కారును గద్దె దించేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. ఎక్కువ దశల్లో ఎన్నికల నిర్వహణ ద్వారా బెంగాల్ పై భాజపా పెద్దలు దృష్టి సారించడానికి అవకాశం ఉంటుంది.

ప్రతి దశలో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, హోంమంత్రి అమిత్ షా వంటి దిగ్గజాలు ప్రచారం చేసేందుకు అవకాశం కలుగుతుంది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను మోహరించడానికి వీలు కలుగుతుంది. అందువల్లే బెంగాల్లో 8 దశల ఎన్నికలకు సీఈసీని కేంద్ర సర్కారు ప్రభావితం చేసిందన్న అభిప్రాయం ఢిల్లీ రాజకీయ వర్గాల్లో బలంగా వినపడుతోంది. అదే 234 సీట్లున్న తమిళనాడుపై భాజపాకు ఎలాంటి ఆశలు లేవు. అందువల్లే అక్కడ ఒకేదఫాలో ఎన్నికలకు ఈసీ వెళ్లిందన్న వాదన వినపడుతోంది.

పైకి మాత్రం బెంగాల్లో శాంతిభద్రతలు, అక్కడ నెలకొన్న సున్నిత పరిస్థితుల వల్లే 8 దశల్లో ఎన్నికలకువెళ్లామని ఈసీ చెబుతోంది.

పైకి చెప్పడానికి ఇది బాగానే ఉన్నప్పటికీ అసలు కారణం మాత్రం రాజకీయమే. ఇక 126 సీట్లున్న అసోంలో అధికారాన్ని కాపాడుకోవడం బీజేపీకి కీలకం. అదే 140 సీట్లున్న దక్షిణాదిన కేరళపై కమలానికి ఎలాంటి ఆశలు లేవు. అందువల్లే అసోంలో మూడు దశల్లో ఎన్నికలు జరిపే విధంగా ఈసీపై కేంద్రం ప్రభావం చూపిందన్న అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినపడుతోంది.

మూడు దశల్లో ఎన్నికల వల్ల యావత్ పార్టీ యంత్రాంగాన్ని ఈ ఈశాన్య భారత రాష్ట్రంలో మోహరించడానికి అవకాశం కలుగుతుంది. ఇప్పటికే మోదీ, షా, నడ్డా వంటి అతిరథ మహారథులు అసోం ను అనేకమార్లు చుట్టివచ్చారు.

మూడు దశల ద్వారా వారికి మరింత అవకాశం కలుగుతుంది. మొత్తానికి బీజేపీ పెద్దలు ముందుచూపుతోనే ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది.

## ఆలోచన మార్చుకుంటేనే మార్పు

'మన సంస్కృతి నశించిపోతూందన్న/ మన పెద్దల విచారానికి/ మనవాడు పిలకమాని క్రాపింగ్ పెట్టుకున్నాడనేది ఆధారం/ మనగలిగినదీ/ కాలానికి నిలబడగలిగినదీ వద్దన్నాపోదు/ మరణించిన అవ్వ నగలు/ మన కాలేజీ అమ్మాయి ఎంత పోరినా పెట్టుకోదు/ యుగయుగానికీ స్వభావం మారుతుంది/ అగుపించని ప్రభావాలకి లొంగుతుంది/ అంతమాత్రాన మనని మనం చిన్నబుచ్చుకొన్నట్టు ఊహించకు' అంటాడు తిలక్. ఇది ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రికీ ఆయన సంఘపరివారానికీ ఎప్పటికైనా బోధపడుతుందా? స్త్రీల వస్త్రధారణ అంశం మళ్లీ చర్చకు రేపాడాయన. స్త్రీలైనా, పురుషులైనా అప్పటి ఫ్యాషన్‌ను బట్టి, ట్రెండ్‌ను బట్టి ఎప్పటికప్పుడు మారుతుంటారు. దుస్తుల ధారణ విషయంలో పాశ్చాత్య సంస్కృతి అనో, స్వదేశీ సంస్కృతి అనో వుండదు. అన్ని దేశాల సంస్కృతి అంతా కలగలిసిపోయిన ఆధునిక ప్రపంచంలో... సంగీతం, సాహిత్యం, శిల్పం, చివరకు సైన్స్ కూడా సంస్కృతిలో ఒక భాగంగా మారిపోతుంది. ఇవన్నీ ఇచ్చిపుచ్చుకునే క్రమంలో మానవజాతి అభివృద్ధి చెందుతుంది. ఇది వదిలేసి... మా సంస్కృతి, మా సంప్రదాయం అంటూ గిరిగీసుకొని బతికితే... ఆదిమానవుల కాలంలోనే వుండిపోవాల్సి వస్తుంది. అండమాన్‌లో ఓంగే అనే తెగ వుంది. ఆ తెగ మొత్తం 110మంది మాత్రమే. వారెందుకు అంతరించిపోతున్నారంటే... ఇతర తెగలతో, ఇతర ప్రాంతాలతో ఎటువంటి సంబంధాలు పెట్టుకోకపోవడం వల్ల. అలాగే, ఎవరితోనూ సంబంధం లేకుండా వుండాలనుకోవడం వెనుకబాటుతనానికి చిహ్నం తప్ప అభివృద్ధికి సంకేతం కాదు. జాతుల మధ్య సంకరం అనేది అభివృద్ధి సూచకం. సంకరం జరుగుతుందని బాధపడేవాడు జాతి అంతరించిపోవడానికి దోహదం చేస్తాడు తప్ప పురోగతికి కాదు. తాజాగా... 'మోకాళ్ల దగ్గర చిరిగిన జీన్స్ (రిప్డ్ జీన్స్) ధరించిన ఆడవాళ్లు తమ పిల్లలకు మంచి ఉదాహరణగా నిలువలేరు. పాశ్చాత్య పిచ్చిలో మన సంస్కృతిని మరిచిపోతున్నాం' అని బిజెపి నాయకుడు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి తీరథ్‌సింగ్ రావత్ వ్యాఖ్యానించడం కూడా తిరోగమన చర్యగానే భావించాలి. అంతరించిపోతున్న జాతికి ప్రతినిధిలా ఆయన మాట్లాడుతున్నారు. హిందూత్వ వాదులు పురుషుల దుస్తుల గురించి ఎందుకు మాట్లాడటంలేదు? సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యత స్త్రీలదే... పురుషులకేమీ సంబంధం లేదన్నట్లుగా కాషాయవాదులు మాట్లాడటం విడ్డూరంగా వుంది. మన దేశంలో 90 శాతానికి పైగా పురుషులు... మన సంప్రదాయ దుస్తులను ఏనాడో వదిలేశారు. సాంప్రదాయ వస్త్రధారణను ఎక్కువగా కొనసాగిస్తున్నది స్త్రీలే. వారికి నచ్చిన విధంగా వస్త్రధారణ చేసుకునే హక్కు వారికుంది. దానిని ఎందుకు గౌరవించరు? దుస్తుల గురించి మాట్లాడుతున్న ప్రతిసారీ... స్త్రీల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకతను ఎందుకు గుర్తించడంలేదు? భిన్న సంస్కృతుల సమ్మేళనాన్ని ఎందుకు జీర్ణించుకోలేకపోతున్నారు? 'ఆది నుండీ, ద్రవిడ బర్బర యవన తురుష్క హూణుల నుండీ, / ఇచ్చినదీ పుచ్చుకున్నదీ ఎంతైనా వున్నదనీ, / అయిదు ఖండాల మానవ సంస్కృతి/ అఖండ వసుదైక రూపాన్ని ధరిస్తోందని' అంటాడు తిలక్. అలాగే... ఎవరితోనూ సంపర్కం పెట్టుకోకుండా మనకు మనమే పాత సాంప్రదాయాల మడికట్టుకోవడం... దాన్ని కాపాడుకోవాలనుకోవడం... వెనుకబాటు తనానికి నిదర్శనం. ఒంటిగా వున్న జాతులు, తెగలు అంతరించిపోతుండటం చారిత్రక వాస్తవం. భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించాలంటే ఈ సాంస్కృతిక సమ్మేళనం గురించి ప్రయత్నించాలి. అప్పుడే మన పూర్వులు ఆశించిన విశ్వమానవ కుటుంబం అనే భావన సాకారమౌతుంది.

## ప్రమాదంలో బీమా

బీమా అంటేనే భవితపై ఒక ధీమా. అనుకోని ఆపదొస్తే, ప్రకృతి ప్రకోపిస్తే, ఆర్థిక సంక్షోభాలేవైనా ముంచుకొస్తే వాటిని సంబంధిత బాధితులే కాకుండా సమాజం మొత్తం ఉమ్మడిగా ఎదుర్కొని కొండంత అండగా నిలిచేలా రూపొందించుకున్న ఒక చక్కటి వ్యవస్థ బీమా రంగం. కేంద్రం లోని మోడీ సర్కార్ ఇప్పుడు ఆ బీమా రంగాన్నే ప్రయివేటుకు కట్టబెట్టి ప్రమాదంలోకి నెట్టేస్తోంది. మన దేశంలో బీమా రంగంపై తొలినాళ్లలో ప్రయివేటు పెత్తనమే నడిచింది. వరుస కుంభకోణాలు, అవినీతిలో కూరుకుపోయిన బీమా రంగాన్ని ప్రయివేటు కబంధ హస్తాల నుంచి విడిపించేందుకు నాడు బీమా రంగ ఉద్యోగులే ఉద్యమించారు. విశాల ప్రజా ప్రయోజనాల కోసం బీమా రంగం ప్రభుత్వంలో ఉండాలన్న డిమాండ్‌తో నాడు కార్మిక, ప్రజా సంఘాల సంఘటిత పోరాటాల ఫలితంగానే 1956లో జీవిత బీమా రంగాన్ని 1971లో సాధారణ బీమా రంగాన్ని జాతీయం చేశారు. కేవలం రూ.5 కోట్ల మూలధనంతో ప్రారంభమైన ఎల్‌ఐసి ఇప్పుడు లక్షల కోట్ల సంపదతో విరాజిల్లుతోంది. ఆర్థిక సంక్షోభం, కరోనా విపత్తు వంటి వరుస కడగండ్లతో ప్రపంచమంతా అతలాకుతలమౌతున్నా భారత్ ఆర్థిక శక్తిగా మనుగడ సాగించగలుగుతోందంటే దానికి కారణం బీమా, బ్యాంకింగ్ రంగం ప్రభుత్వ రంగంలో ఉండటమే. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ బీమా రంగం, ప్రభుత్వ బ్యాంకులు ఎనలేని నిధులు సమకూర్చి దేశసేవలో పునీతమయ్యాయి. ప్రజల క్లయిములను సకాలంలో పరిష్కరిస్తూ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక సంస్థలుగా మన్ననలు పొందుతున్నాయి. నయా సరళీకరణ విధానాలు అమల్లోకి వచ్చిన నాటి నుంచి వీటిని తిరిగి ప్రయివేటుకు అప్పగించే ప్రయత్నాలను పాలకులు కొనసాగిస్తూ వచ్చారు. కానీ ప్రయివేటు శక్తుల ఆక్రమణ ఆగడాలను తిప్పికొడుతూ ఇప్పటివరకూ పరిరక్షిస్తూ వచ్చింది పోరాటాలే. ఇకముందు కూడా వాటిని నిలబెట్టేదీ ఆ పోరాటాలే. దేశ భవిష్యత్తు ఒడిదుడుకుల్లో ఆర్థిక సుడిగుండాల్లో చిక్కుకోకుండా ఉండాలంటే ఎల్‌ఐసి ప్రభుత్వ రంగంలోనే ఉండాలంటూ ఉద్యోగులు గురువారం దేశ వ్యాపిత సమ్మె చేపట్టారు. సరిగ్గా అదే రోజు బీమా రంగానికి గొడ్డలిపెట్టు వంటి ఇన్సూరెన్స్ చట్ట సవరణ బిల్లును ప్రతిపక్షాల వాకౌట్ మధ్య రాజ్యసభలో మోడీ సర్కార్ మూజువాణి ఓటుతో ఆమోదించిందంటే కార్పొరేట్ కంపెనీలకు కేంద్రం ఎంతగా లొంగిపోయిందో అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ సంస్థల ప్రయివేటీకరణ వల్ల అదనపు ప్రజా ప్రయోజనం నెరవేరిన ఘటన ప్రపంచంలో మచ్చుకైనా కానరాదు. భారతీయ స్టేట్ బ్యాంకు మాజీ చైర్మన్ రజనీష్ కుమార్ లాంటి నిపుణులు ఈ విషయాన్ని లేవనెత్తి బ్యాంకులు, బీమా వంటి ఆర్థిక సంస్థలు ప్రభుత్వ రంగంలో ఉండాల్సిన ఆవశ్యకతను గుర్తు చేశారు. కానీ ఆర్థిక నిపుణులు మాటలను చెవికెక్కించుకుంటే అది మోడీ సర్కార్ ఎందుకు అవుతుంది? ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు నిరంతరం పోరు సల్పుతున్న వామపక్షాలు ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకించి చట్టసభల్లోనూ ప్రజాగళాన్ని గట్టిగానే వినిపించాయి. కానీ తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రధాన పార్టీలు నోరు మెదిపి మెదపలేక విశేష నటనాకౌశలాన్ని ప్రదర్శించాయి.

## అసైన్డ్‌పై చర్య.. అమరావతికీ న్యాయం..

మునిసిపల్ ఎన్నికల ఫలితాలలో వైసిపి ఏకపక్ష విజయం హడావుడి ముగియక ముందే ప్రతిపక్ష నేత, టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు నాయుడుకు ఎ.పి సిఐడి నోటీసుల కలకలం మొదలైంది. ఎన్నికల ఫలితాలను మూడు రాజధానులకు ఆమోదంగా చెబుతున్న అధికార వైసిపి ఆ వేడి చల్లారక ముందే మరో దశ చర్యలు ప్రారంభించింది. గతంలో వేసిన అమరావతి ఇన్‌సైడర్ ట్రేడింగ్ కేసుతో సంబంధం లేకుండా మరో స్థాయిలో దీన్ని ముందుకు తెచ్చారు. ఆ కేసులో హైకోర్టు స్టే కొనసాగుతుండగా సుప్రీం కోర్టు ఏప్రిల్ 7న పూర్తి స్థాయి విచారణ జరపనుంది. ఈ పూర్వరంగం లోనే ముందు జాగ్రత్తగా ఎస్.సి, ఎస్.టి అత్యాచార చట్టం కింద అసైన్డ్ భూముల సమస్యపై సిఐడి విచారణ చేపట్టి చంద్రబాబుకు నోటీసులు జారీ చేశారని చెప్పొచ్చు. ఈ సమస్యపై వారు తనకు ఫిర్యాదు చేశారంటూ మంగళగిరి ఎంఎల్ఎ ఆళ్ల రామకృష్ణారెడ్డి ఫిబ్రవరి 24న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సిఐడి ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఇప్పుడు హైకోర్టు చంద్రబాబుకు, మాజీ మంత్రి నారాయణకు సంబంధించిన క్వాష్ పిటిషన్‌లో నెల రోజుల పాటు ఎలాంటి తదుపరి చర్యలు తీసుకోవద్దని స్టే ఇచ్చింది. ఈ స్టే పిటిషన్‌దార్లకే వర్తిస్తుందని మిగిలిన దర్యాప్తునకు ఆటంకం కాబోదని వివరణ ఇచ్చింది. ఆలోగా సిఆర్‌డిఎ గత కమిషనర్ చెరుకూరి శ్రీధర్‌నూ, ఫిర్యాదు చేసిన ఎంఎల్ఎ ఆర్కేను సిఐడి విచారించింది కూడా. రాజధాని ప్రకటనకు ముందు జరిగింది ఇన్‌సైడర్ ట్రేడింగ్ కాగా అధికారిక ప్రకటన ముందు, తర్వాత బహిరంగంగా నడిచింది అసైన్డ్ భూముల ప్రహసనం. అసైన్డ్ భూములు ప్రభుత్వం ఇచ్చినవే గనక వాటికి పరిహారం అక్కర్లేదని ముందుగా చెప్పారు. నిరసనల తర్వాత ఏకమొత్తంగా ఇచ్చి తీసుకుంటామని జీవో తెచ్చారు. ఇవన్నీ మీరు తట్టుకోలేరని భయపెట్టడంతో చాలా మంది దళితులు తమ భూములను పాలకపక్ష పెద్దలకు అమ్మేసుకున్నారు. ఆ తర్వాత వారికి కూడా ఇతరులకు ఇచ్చినట్టే ప్లాట్లు ఇస్తామన్నారు. ఇందుకోసం 2015 జనవరి 1న జీవో ఎంఎస్1 తీసుకొచ్చారు. 2016 ఫిబ్రవరి 17న జీవో41, జూన్ 21న జీవో 259 మూడు ఉత్తర్వులు తెచ్చారు. తమను బెదిరించి మోసగించి భూములు తీసుకుని తర్వాత పరిహారం పెంచుకున్నారని అప్పట్లోనే దళితులు ఆవేదన వ్యక్తం చేశారు.

దళితుల పోరాటాలపై నిర్బంధం..

ఇప్పుడు చంద్రబాబుపై కక్ష సాధింపుకోసమే ఇదంతా చేస్తున్నారని టిడిపి నేతలు వరుసకట్టి ఆరోపిస్తున్నారు. ఈ ఎఫ్ఐఆర్ హాస్యాస్పదంగా వుందని నిలవబోదని అంటూనే జైలుకు పంపించడానికే కుట్ర పన్నారని ఆరోపిస్తున్నారు. కనుక ఇలా చెప్పడంలో టిడిపి ద్వంద్వత్వం వుంది. పాలక పక్షం మాత్రం తమకు ఎవరిపై కక్ష లేదనీ. న్యాయం కోసమే ఇవన్నీ చేస్తున్నామని సమర్థించుకుంటూ వుంది. ఇన్నిటి మధ్య ఈ నోటీసును గాని స్టేను గాని ఎలా చూడాలనేది కీలక ప్రశ్న. నోటీసులు కేసులు అన్నదానిలో రాజకీయ కోణం వుండవచ్చుగాని అసైన్డ్ భూమి స్వాధీనంలో మాయాజాలం జరగనేలేదని అంటే తప్పవుతుంది. అమరావతి అవకతవకలపై పోరాటమే అసైన్డ భూములతో మొదలైంది. సిపిఎం రాజధాని ప్రాంత కమిటీ ప్రధానంగా అందుకు ఆధ్వర్యం వహించింది. మొదట దళితులు సాగు చేసుకుంటున్న భూములకు ప్యాకేజీ ఇవ్వబోమని చెప్పి ధర రాకుండా చేశారు. ఇతరులు కొనుక్కున్న తరువాత ప్యాకేజీ ప్రకటించారని ఇదెక్కడి న్యాయమని ఆ ప్రాంతానికి చెందిన పలువురు రైతులు అప్పట్లోనే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు ఇలాంటి భూములు కొనుగోలు చేశారనే అంశంపై ఉండవల్లి, పెనుమాక, ఐనవోలు, నిడమర్రు, కృష్ణాయపాలెం గ్రామాల్లో వ్యతిరేకత నెలకొంది. పూలింగు అనంతరం భూములు కొనుగోలు చేయడంపై దాదాపు అన్ని గ్రామాల్లోనూ తీవ్ర చర్చ జరిగింది. జరీబు గ్రామాలలో అసైన్డ్ భూముల వ్యవహారంపై తమను నమ్మించి మోసం చేశారనే అభిప్రాయం దళిత సామాజిక వర్గానికి చెందిన రైతుల్లో ఏర్పడింది. భూముల వ్యవహారంపై వచ్చిన వార్తల వల్ల తమకు నష్టం జరిగిందని పలువురు రైతులు 2015 ప్రారంభం లోనే మంగళగిరి, తుళ్లూరు పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేశారు. అసైన్డ్, సీలింగు భూములకు పరిహారం, నిరుపేదలకిస్తామన్న రూ.2500 పెన్షనివ్వాలని తుళ్లూరులో రాస్తారోకోకు దిగిన పేదలపై పోలీసులు తమ ప్రతాపం చూపించారు. నడిరోడ్డుపై ఈడ్చిపారేశారు. దీంతో తీవ్ర ఉద్రికత్తత ఏర్పడింది. సి.ఐ హనుమంతరావు నాయకులను, పేదలను అనేక విధాల దూషించారు. అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లడమే గాక వార్తల కోసం వెళ్లిన మీడియా ప్రతినిధులను బయటకు నెట్టేసి గేట్లు పెట్టేశారు. 2015 ఆగష్టు 4న తుళ్లూరులో క్రిడా కార్యాలయం ముందు ఆర్ అండ్‌బి రహదారిపై రాస్తారోకోకు దిగారు. హుటాహుటిన అక్కడకు పోలీసులు చేరుకుని ఆందోళన నిలిపేయాలని హుకుం జారీ చేశారు. నాయకులను లాగిపడేశారు. అరెస్టు చేసి జీపుల్లో ఎక్కించారు. స్థానిక మహిళలు, పేదలు, దళితులు జీపులకు అడ్డం పడ్డారు. వారినీ ఈడ్చిపడేశారు. ఈ క్రమంలో బాబూరావు, రవి, సుజానమ్మ, చిలకమ్మ, బెజ్జం మాధవరావుకు గాయాలయ్యాయి. అరెస్టుల విషయం తెలుసుకున్న ఆయా గ్రామాల ప్రజలు మధ్యాహ్నానికి పెద్దఎత్తున స్టేషన్‌కు చేరుకుని నిరసన తెలిపారు. బహిరంగ నిరసనలపై ప్రభుత్వం ఆంక్షలు పెట్టటంతో మరొక దశలో ఎవరిళ్లల్లో వారే మూతికి నల్లగుడ్డలు కట్టుకుని 30 చోట్ల వందలాది మంది మహిళలు గృహదీక్ష చేపట్టారు. అసైన్డ్, సీలింగు భూముల లబ్ధిదారులకు పరిహారం చెక్కులివ్వాలని ప్రభుత్వం స్పందించే వరకూ పచ్చి మంచినీళ్లు కూడా తాగబోమంటూ భీష్మించుకు కూర్చున్నారు. దీక్షకు మద్దతుగా సిపిఎం క్రిడా కన్వీనర్ సిహెచ్. బాబూరావు మాట్లాడుతూ పేదలు, దళితులను భయపెట్టి వారి భూములు లాక్కుని అధికార పార్టీ పెద్దలకు కట్టబెట్టే కుట్ర జరుగుతోందని విమర్శించారు. 206 ఎకరాల భూములను 380 మంది పేద రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటున్నారని వాటికి ఇంతవరకు కౌలు పరిహారం ఇవ్వలేదని తెలిపారు. లంకల్లో ఉన్న మరో 2000 ఎకరాల భూములనూ ఇచ్చేస్తామని ప్రకటనలు చేస్తూ పేదలను భయపెడుతున్నారని తెలిపారు.

ప్రపంచ బ్యాంకు విమర్శ, ఎస్.సి కమిషన్ ఆగ్రహం

రాజధాని ప్రాంత రైతులు భూ సమీకరణ విధానంలో తప్పులపై ఫిర్యాదు చేయడంతో ప్రపంచ బ్యాంకు పర్యవేక్షక బృందం 2017 ఆగష్టు సెప్టెంబరు నెలల్లో అమరావతి ప్రాంతంలో పర్యటించింది. అనేక మందిని కలుసుకుని ఫిర్యాదులు, విమర్శలు స్వీకరించింది. సమస్యలు ఆలకించింది. కొన్ని సమావేశాలలో కూడా పాల్గొంది. ఈ పర్యటనను సిఆర్‌డిఎ కూడా నమోదు చేసింది. భూసమీకరణ హడావుడిగా ఏకపక్షంగా జరిగింది గనక మరింత లోతైన పరిశీలన అవసరమని అభిప్రాయపడింది. నిజంగానే దీనివల్ల హాని కలిగే అవకాశముందని, విధాన సూత్రాలు పాటించలేదని హెచ్చరించింది. ప్రజలు చాలా తీవ్రమైన విషయాలే దృష్టికి తెచ్చారని కూలంకషంగా దర్యాప్తు జరిపితే తప్ప వాటిని నిగ్గు తేల్చలేమని పేర్కొంటూ ఒక నివేదిక ప్రపంచ బ్యాంకు వెబ్‌సైట్‌లో ప్రత్యక్షమైంది. పునరావాసం, పర్యావరణ పరిరక్షణ, ఆహార భద్రత తదితర విషయాలపై రాష్ట్ర ప్రభుత్వం అసత్యాలు చెప్పినట్టు అందులో స్పష్టం చేశారు. వ్యవసాయ కార్మికులు దారుణంగా నష్టపోయారని ఆవేదన వెలిబుచ్చింది. ఈ 102 పేజీల నివేదికను పరిశీలకులూ మీడియా వ్యాఖ్యాతలూ గమనించారు. అయితే కొద్ది రోజుల్లోనే దాన్ని వెబ్‌సైట్ నుంచి ఆదరాబాదరగా తీసి వేశారు. ఈ నిర్బంధానికి మీడియా పాక్షికత్వాన్ని కూడా జోడించి చూస్తే తప్ప పూర్తి చిత్రం బోధపడదు. అమరావతికి అంకురార్పణ కూడా జరగక ముందు నుంచే అనుకూల మీడియా అతిశయోక్తులు కుమ్మరించింది. స్థానికుల ఆందోళనలు, నిరసనలు, పోలీసు నిర్బంధం వంటి వార్తలు దాదాపు ప్రచురించలేదు. మరో విధంగానూ రాజధాని ప్రాంతంలో దళితులపై ప్రభుత్వ వేధింపులు సాగాయి. ఆ ప్రాంతంలో పర్యటించిన ప్రతిపక్ష నాయకులకు మద్దతిచ్చారనే ఉద్దేశంతో భూములను అమ్ముకోనివ్వకుండా ప్రభుత్వ వర్గాలు అడ్డుపడ్డాయి. కొనుగోలు చేసుకుందామని



వచ్చిన వారినీ భయభ్రాంతులకు గురిచేయడం రాజధానిలో కనబడని సామాజిక వివక్షకు నిదర్శనంగా మారింది. రాజ్యాంగ సంస్థలు కూడా పలు సందర్భాల్లో ఆగ్రహం వ్యక్తం చేశాయి. రాజధానిలో దళితుల సమస్యలపై జాతీయ ఎస్.సి కమిషన్ విజయవాడలో విచారణ నిర్వహించింది. దీనికి సభ్యులు పి.ఎం.కమలమ్మ హాజరయ్యారు. రాజధానిలో దళితులను ఉంచాలనుకుంటున్నారా? ఇంకేమైనా చేద్దామనుకుంటున్నారా? అక్కడ దళిత ప్రజలకు స్థానం లేనప్పుడు రాజధాని ఎందుకు కడుతున్నారో చెప్పాలని ఎస్.సి కమిషన్ సిఆర్‌డిఎ అధికారులను ప్రశ్నించింది. దళితులకు అన్యాయం చేసే విధంగా ఉన్న జీఓ నెంబరు 41 సస్పెండ్ చేసేందుకు సిఫార్సు చేస్తామని తెలిపారు. రాజధానిలో దళితులు ఎంతమంది, వారు ఎంత నష్టపోయారనే విషయంపై అధికారుల వద్ద సమాచారం లేదని తెలిపారు.

అమరావతికి రక్షణ, అక్రమాల సవరణ..

కనుక అమరావతి ప్రాంతంలో అసైన్డ్ భూములు మిథ్య, దళిత సమస్య మిథ్య అన్నట్టు మాట్లాడ్డం వాస్తవికం కాజాలదు. జెఎసి దీక్షలకు వ్యతిరేకంగా పోటీ దళిత దీక్షలు జరపడంతప్ప ఆ సమస్యలపై జగన్ ప్రభుత్వం ఇప్పటి వరకూ నిర్దిష్టంగా తీసుకున్న పరిష్కార చర్యలు కూడా లేవు. హఠాత్తుగా మంగళగిరి ఎంఎల్ఎ ఆర్కే ఫిర్యాదుపై చంద్రబాబుకు సిఐడి నోటీసు ఇవ్వడం నాటకీయతకు కారణమైంది గాని సమస్య మూలాల్లోకి వెళ్లవలసిన అవసరం అలాగే వుంది. అమరావతిని కాపాడుకోవడమంటే గత ప్రభుత్వ హయాంలో పొరబాట్లను, అక్రమాలను సమర్థించడం కాదు. అసైన్డ్ భూములపై దశలవారీగా విడుదలైన జీవోలు, వాటివల్ల దళితులకు జరిగిన నష్టాలు నిగ్గు తేల్చి న్యాయం చేయడం ముఖ్యం. దళితులు నేరుగా ఫిర్యాదు చేయలేదనేది పెద్ద సమస్యగా చేయడం లేదంటే, సిఆర్‌డిఎ చట్టం సెక్షన్ 146 ప్రకారం రాజధాని కోసం తీసుకున్న నిర్ణయాలకు సంబంధించి ఎవరిపైనా చర్యలు తీసుకోవడానికి లేదని సాంకేతికంగా సమర్థించుకోవడం చెల్లుబాటయ్యేవి కావు. వ్యక్తిగతంగా ఎవరి పాత్ర ఎంత, ఏ చర్యలు తీసుకోవాలనేది కోర్టులు తేల్చవచ్చు కాని తప్పులు చక్కదిద్దాల్సిందే. అయితే గత తప్పిదాలపై చర్యలు, అమరావతి ప్రతిష్టంభన పరిష్కరించి, రాజధానిగా కొనసాగించడం ద్వారా న్యాయం చేయడం వేర్వేరు అంశాలని ప్రస్తుత ప్రభుత్వం గ్రహించడం అవసరం.

## మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం



**బాపట్ల, ప్రజా పాలన ప్రతినిధి :** బాపట్ల జమ్ములపాలెం రోడ్డులో ఉన్న యమ్.యెస్.ఆర్ కల్యాణ మండపంలో మాదక ద్రవ్యాల పై విద్యార్థులకు సబ్ డివిజన్ పరిధిలో ఉన్న పోలీసులు అవగాహన కార్యక్రమాన్నీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు మాదక ద్రవ్యాల పట్ల విద్యార్థులకు సూచనలు తెలియజేసారు. ఈ సందర్భంగా లిసబ్ డివిజన్ అధికారి డిఎస్పీ ఏ శ్రీనివాసరావులి మాట్లాడుతూ విద్యార్థులు చెడు వ్యసనాలకు లోనుకాకుండా మంచి నడవడిక కలిగి ఉండాలని అలాగే మత్తు పదార్థాల వలన చెడు వ్యసనాలకు బానిసలు అవుతున్నారని ఇలాంటి వాటికి దూరంగా ఉండి బాగా చదువుకొని మీ తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమం అనంతరం కల్యాణ మండపం నుండి అంబెద్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పి.పి. హెచ్ సి. హెచ్ పద్మ , ఎక్సైజ్ సిఐ రవనమ్మా, లాయర్ కంచర్ల రవి కుమార్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వి.దామోదర నాయుడు , టౌన్ సిఐ అశోక్ కుమార్ ,రురల్ సిఐ శ్రీనివాస రెడ్డి,పొన్నూరు సిఐ ,అలహరి శ్రీనివాసరావు రేపల్లె సిఐ, ఎస్సైలు మహ్మద్ రఫీ,వెంకట ప్రసాద్,రాజశేఖర్,జనార్దన్,కాకుమాను ఎస్సై,కర్లపాలెం ఎస్సై,లు పాల్గొన్నారు.

## పిఆర్సిని వెంటనే ప్రకటించాలి

**-నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు**



**విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి :** ఆంధ్రప్రదేశ్ నందు పిఆర్సిని వెంటనే ప్రకటించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ ,మాగంటి శ్రీనివాసరావులు ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ధరల సూచిక పెరిగిన దృష్ట్యా ,ఉద్యోగుల కుటుంబ జీవన ప్రమాణ స్థాయి పడిపోతోందని ,కొనుగోలు శక్తి సన్నగిల్లుతోంది అని వివరించారు .ఈ నేపథ్యంలో పిఆర్సి ని ఫిట్మెంట్ 40% తక్కువ కాకుండా వెంటనే ప్రకటించాలని,రిటైర్మెంట్ గ్రాట్యూటీ 20లక్షలు , అదనపు క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ వయోపరిమతిని 75సంవత్సరాలు నుండీ 70 సం.లకు తగ్గించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## అంచులవారిపాలెం గ్రామంలో జలశక్తి అభయాన్



**రాజుపాలెం, ప్రజా పాలన ప్రతినిధి :** ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా అంచుల వారి పాలెం గ్రామం లో జలశక్తి అభయాన్ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ అంచుల రామాంజనేయులు గారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ కాలంలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటం వల్ల వర్షాలు అధికముగా పడటం వల్ల నీటి కొరత ఉండేది కాదని,కానీ ఈరోజుల్లో వాతావరణ లో కాలుష్యం కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోయి నీటి కొరత వల్ల కొన్ని కోట్ల మంది కి కూడా నీటి వనరులు పుష్కలంగా అందటం లేదని దీనిని నివారించాలంటే ప్రతి ఒక్క ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని దాని వల్ల వర్షపు నీటిని, వేస్ట్ నీరును ఒడిసి పట్టుకొని నీటి కొరతను కొంత మేరకు తగ్గించి భూగర్భ జలాలని పెంచుకోవాలని తగు సూచలని చేశారు అనంతరం ప్రతిజ్ఞ ని అందరి చేత చేయించారు ఇంకా ఈ కార్యక్రమంలో, జిల్లా కార్యదర్శి తోట ప్రభాకరరావు, అభ్యర్థి హరి సూరమ్మ నాగేశ్వర రావు గారు, వేపోరి స్వామి శంకరరావు గారు, పంచాయతీ సెక్రటరీ ముక్తార్, ఆశా వర్కర్లు, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత ఇంగ్లీషు శిక్షణా కార్యక్రమం

**విజయవాడ, ప్రజా పాలన ప్రతినిధి:** ది 28.03.2021 ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకూ విజయవాడ దుర్గాపురం (రోకళ్ళపాలెం) విజయ నర్సింగ్ స్కూల్ ఆవరణలో ఒకరోజు ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్ శిక్షణా కార్యక్రమము నిర్వహిస్తున్నామని పూలే అంబేద్కర్ స్టడి సర్కిల్ నిర్వాహకులు పూలే అంబేద్కర్ రాజ్యాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు మరియు విజయవాడ పార్లమెంటు కన్వీనర్ సి హెచ్ వెంకట్ నేడు ఒక ప్రకటన లో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుతున్న సమాజంలో ఇంగ్లీషు ఆవశ్యకత పెరిగిందని విద్యార్థులు,యువకులు ఉపాధ్యాయులలో ఇంగ్లీష్ పట్ల భయాన్ని పోగొట్టి వారిలో ఆత్మవిశ్వాసం నింపటం కొరకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే వారికి ఉచిత భోజన మరియు ఉచిత ఇంగ్లీషు మెటీరియల్ ఇవ్వబడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ శిక్షణ లో పాల్గొనదలచిన వారు ఈ క్రింది ఫోన్ నంబర్ లకు o919989645564,9000621111 ఫోన్ చేసి పేరు నమోదు చేయించుకోవాలి అని తెలియజేశారు.





## చేనేతలకు తగిన గుర్తింపుని, గౌరవాన్ని అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- వైయస్సార్ సిపి జిల్లా యువనేత కరణం వెంకటేష్ బాబు
- బీసీలకు పెద్ద పీట వేస్తున్న ముఖ్యమంత్రి వైయస్ జగన్
- మంచికి మారుపేరుగా నిలిచిన జంజనం శ్రీనివాసరావు
- మున్సిపల్ చైర్మన్ జంజనానికి ఘన సన్మానం,
- అందరికీ రుణపడి ఉంటానన్న జంజనం

**చీరాల(ఒంగోలు) ప్రజాపాలన ప్రతినిధి :** చేనేతలు అధికంగా ఉండే చీరాల నియోజకవర్గంలో, చేనేత నాయకులు జంజనం శ్రీనివాసరావుని, చీరాల మున్సిపల్ చైర్మన్‌గా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎంపిక చేయడం ద్వారా, చేనేతలకు తగిన గుర్తింపుని, గౌరవాన్ని అందించిన ఏకైక ముఖ్యమంత్రి వైయస్ జగన్ అయ్యారని, వైయస్సార్ సిపి జిల్లా యువనేత కరణం వెంకటేష్ బాబు అన్నారు.

స్థానిక పద్మశాలీయ బహూత్తమ సంఘం వారి కళ్యాణ మండపంలో, మున్సిపల్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసి, బాధ్యతలు చేపట్టిన జంజనం శ్రీనివాసరావును, వైస్ ఛైర్మన్ బొనిగల జైసన్‌బాబును, ఇతర కౌన్సిలర్లు చేనేత కౌన్సిలర్స్ గోలి జగదీష్, గోలి స్వాతి, తోకల అనీల్ కుమార్, దాసరి శారద, పద్మశాలి కార్పోరేషన్ స్టేట్ డైరెక్టర్ గోలి కుమారి లను, పద్మశాలి ఇంటర్నేష నల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిధిగా విచ్చేసిన కరణం వెంకటేష్ బాబు మాట్లాడుతూ, చేనేతలకు గుర్తింపు తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్మోహనరెడ్డికే దక్కిందని, చేనేత అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా జంజనం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, తనకు ఛైర్మన్ పదవి వచ్చేందుకు, కృషి చేసిన అందరికీ రుణపడి ఉంటానని, ముఖ్యంగా ఎమ్మెల్యే బలరామకృష్ణమూర్తి అందించిన సహకారం, జీవితాంతం మరువలేనని మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. ఎమ్మెల్యే కరణం బలరాం సహకారంతో, చీరాల పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని, మున్సిపల్ ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. ముందుగా గడియార స్తంభం సెంటర్లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో పీఐడబ్ల్యూ (పివా)చీరాల కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జీవీ పున్నారావు, సెక్రటరీ ఊట్ల వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ ఊట్ల. సాంబశివరావు, కోశాధికారి తునకాల.రామాంజనేయులు సెంట్రల్ కమిటీ సెక్రటరీ విన్నకోట వెంకటేశ్వర్లు(కన్నామాస్టార్), కమిటీ మెంబర్సు అనుభంసాంబశివరావు, ఉడతా.రమేష్, గోలి. వెంకట మల్లిఖార్జునుడు, బండారు బాల, గోలి జ్ఞానప్రసాద్, రామనాథం, చెన్నకేశవులు, డాక్టర్ ఉమామహేశ్వరరావు, దామర్ల శ్రీకృష్ణ, మేడా వెంకటరావు, బండారు జ్వాలానరసింహం, అందే నరసింహారావు, అండగుండ.నారాయణ, గోలి గిరికుమార్, తోకల బిక్షాలు, బత్తుల అనిల్‌కుమార్, కంపా అరుణ్, చీమకుర్తి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**మున్సిపల్ చైర్మన్‌కు, డియస్పీ శుభాకాంక్షలు :** చీరాల మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన జంజనం శ్రీనివాసరావుని, చీరాలడియస్పీ పి.శ్రీకాంత్, మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. చైర్మన్, వైస్ చైర్మన్, కరణం వెంకటేష్‌బాబు లకు, ఇంకా వేదికపై ఉన్న ఇతర కౌన్సిలర్స్‌కి, బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. డియస్పీతోపా టుగా, చీరాల వన్ టౌన్ సి.ఐ రాజమోహన్ ఉన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం.. రాష్ట్రంలో అన్ని ప్రాంతాల అభివృద్ధియే లక్ష్యం...





- నగర అభివృద్ధి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్.ఖలీఫాతుల్లాబాషా
- రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా కొలిశెట్టి పవన్‌కుమార్, సంఘ కడపజిల్లా ఉపాధ్యక్షుడుగా మద.సురేంద్ర

**ఒంగోలు, ప్రజాపాలన ప్రతినిధి :** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల అభివృద్ధియే లక్ష్యంగా, ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, నగర అభివృద్ధి సేవా సంఘం కృషి చేస్తుందని, సంఘ రాష్ట్ర అధ్యక్షులు షేక్.ఖలీఫాతుల్లాబాషా అన్నారు. నగర అభివృద్ధి సేవ సంఘం ఏపి రాష్ట్ర జాయింట్ సెక్రెటరీగా కొలిశెట్టి పవన్‌కుమార్‌ను,నగర అభివృద్ధి సేవా సంఘం కడపజిల్లా ఉపాధ్యక్షుడు గా మద.సురేంద్ర లను నియమించారు. ఒంగోలులో, నగర అభివృద్ధి సేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్. ఖలీఫాతుల్లాబాషా, నియామకపత్రాలను వారికి అందజేశారు. ఈ సంధర్భంగా నగర అభివృద్ధి సేవా సంఘం ఏపి రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమితుడైన పవన్ కుమార్ మాట్లాడుతూ, నన్ను నగర అభివృద్ధి సేవ సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా నియమించినందుకు, రాష్ట్ర అధ్యక్షుడు షేక్. ఖలీఫాతుల్లాబాషా కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, ప్రజలకు ప్రభుత్వానికి అనుసంధానం చేస్తూ, వారధిగా సేవ చేస్తానని తెలిపారు. తమ ప్రాంతాలలో సమస్యలపరిష్కారానికి కృషిచేయడంతో పాటు, ఆయా ప్రాంతాలఅభివృద్ధికి నగరఅభివృద్ధి సేవా సంఘం ఆధ్వర్యంలో,కార్యక్రమాలు విస్తృతం చేయాలని,నూతన రాష్ట్రఅధ్యక్షులు షేక్. ఖలీషాతుల్లాబాషా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర అభివృద్ధి సేవా సంఘం కడపజిల్లా అధ్యక్షుడు షేక్. బాబావక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు

## బంగారు భవిష్యత్తును కాపాడుకోండి

**కారంపూడి ఎస్సై గల్లా రావికృష్ణ**



**కారంపూడి, ప్రజాపాలన ప్రతినిధి :** రాష్ట్ర డిజిపి ఆధ్వర్యంలో జిల్లా రూరల్ ఎస్పి విశాల్ గున్ని ఆదేశాల మేరకు మత్తుపదార్థాల వాడకం పై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్లో ఎస్సై గల్లా రావికృష్ణ ఆధ్వర్యంలో జరిగింది ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ చెడు వ్యసనాల మత్తు పదార్థాలకు బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని పోలీసులు అన్నారు గంజాయి గుట్కా వంటి పదార్థాలతో ఆరోగ్యాన్ని పాడుచేసుకోవడమే కాకుండా సమాజంలో దేనికి పనికిరాని వారిగా తయారయ్యే అవకాశం ఉందని వారన్నారు మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల గొడవలు కూడా జరిగే అవకాశాలు ఉన్నాయని దీంతో ఏం చేశారో తెలియక క్షణిక ఆవేశాలకు లోనై కేసులకు కూడా దారితీసే పరిస్థితి నెలకొంటుందని వారన్నారు ఈ సందర్భంగా జిల్లా పరిషత్ హై స్కూల్ విద్యార్థులతో స్థానిక పాఠశాల వద్ద నుండి నాగులేరు బ్రిడ్జి వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు కార్యక్రమం అనంతరం బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించి మత్తు పదార్థాలు మనుకుంటాం అంటూ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు






## వార్డు అభివృద్ధే లక్ష్యంగా కృషిచేసి మంచి పేరు తెచ్చుకోవాలి

**మాజీ ఎమ్మెల్యే ఆమంచి... ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ఆమంచి**



**చీరాల(ఒంగోలు), ప్రజాపాలన ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా, వార్డు అభివృద్ధే లక్ష్యంగా కృషిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ అన్నారు.చీరాల మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులో, ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో, గుండాల సలోమీ ఘన విజయం సాధించిన సందర్భంగా, వారి నివాసం నందు, ఏర్పాటు చేసిన కార్యక్రమానికి, చీరాల వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు ఆమంచి కృష్ణమోహన్ పాల్గొన్నారు. అనంతరం వారి నివాసంలో, మేరిమాతకు ప్రత్యేకప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సలోమీ, వసంతరావు, ఎఎంసి చైర్మన్ మార్పు గ్రెగోరి, కనపర్తి బజ్జి బాబు, సల్లూరి సత్యానందం, గుద్దంటిసత్యనారాయణ, కోటిదాసు, కొండ్రుకిరణ్, థమన్, చెల్లిబాబు, చింతాశ్రీను, కాగితాలకిషోర్, గరికిపాటిసుధీర్, బోనిగలపేతురుబాబు, గొర్రెముచ్చురాంబాబు, కోటేశ్వరరావు, దుడ్డు ప్రభాకర్, కందుల విజయ్‌కుమార్, సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.





నరసరావుపేట మండలం ములకలూరు గ్రామం లో సర్పంచ్, ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

# ఇంటర్, డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలి

## విద్యార్థులకు న్యాయం చేయాలి




**మధిర, ప్రజా పాలన ప్రతినిధి :** ఇంటర్, డిగ్రీ పరీక్షలు వాయిదా వేయాలని %ాఖీ×% ఖమ్మం జిల్లా అధ్యక్షులు వడ్రాణపు మధు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వ్యాప్తంగా కరోనా రోజురోజుకీ పెరుగుతూ ఇప్పటికే పలు ప్రభుత్వ పాఠశాల, కళాశాల, హాస్టల్ లో ఉన్నటువంటి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, సిబ్బందికి మరియు తల్లిదండ్రులకు కూడా వ్యాపించింది. అదేవిధంగా ఇప్పటివరకు ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు పూర్తి స్థాయిలో తరగతులు జరగకుండానే, సిలబస్ పూర్తి కాకుండానే పరీక్ష ఎలా నిర్వహిస్తారు. ప్రైవేట్ కళాశాల యాజమాన్యం అయినటువంటి ప్రాక్టికల్స్ పరీక్షలు పేరుతో విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్నటువంటి కళాశాలల పైన చర్యలు తీసుకోవాలి. మరియు కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఫిబ్రవరిలో నిర్వహించినటువంటి డిగ్రీ థర్డ్ సెమ్ ఫలితాలను విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులు అయోమయ స్థితిలో పడి మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఇంటర్మీడియట్ విద్యార్థుల పరిస్థితి కూడా గందరగోళంగా ఉన్నది... దీనిలో భాగంగానే డిగ్రీ సెమ్, ఫిఫ్త్ సేమ్ పరీక్షలు రాసే అటువంటి విద్యార్థులు కూడా కరోనా బారిన పడడం జరిగింది. అలాగే ఇంటర్మీడియట్ పరీక్షలు వలన విద్యార్థులకు చాలా నష్టం చేసే పరిస్థితి ఉంది.. ఈ సమయంలో విద్యార్థులు అందరూ కూడా ఒక వైపు ఇంటిదగ్గర, మరోవైపు ఐసోలేషన్ కేంద్రంలో చికిత్స తీసుకోవడం జరుగుతుంది. ఇలాంటి సమయంలో పరీక్షలు ఎలా నిర్వహిస్తారు.? విద్యార్థులు పరీక్షలు ఎలా రాస్తారు.? ప్రభుత్వం ఆలోచించాలి...? కావున విద్యార్థులకు నష్టం జరగకుండా డిగ్రీ పరీక్షల ను, ఇంటర్మీడియట్ పరీక్షలను వాయిదా వేయాలి... ఈ కార్యక్రమాల్లో గణష్, పేరు స్వామి, రాజేష్, సాయి, నితిన్ రవి తదితరులు పాల్గొన్నారు.

# భారతరత్న అంబేద్కర్ ను అవమాన పరిచిన రంగా కిరణ్ జాతికి క్షమాపణ చెప్పాలి

## భారత రత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల శివ కుమార్



**భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాపాలన ప్రతినిధి :** సామాజిక న్యాయం కోసం సమసమాజ స్థాపన కోసం భారత దేశ సమగ్రత సార్వభౌమ త్వాన్ని భారత దేశ అభివృద్ధికి దశ దిశ నిర్దేశక త్వాన్ని చూపించిన మార్గదర్శకుడు తన అపరిమిత మేధస్సుతో భారత రాజ్యాంగాన్ని రచించి అందులో ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ మహిళలుమరియు అగ్రవర్ణాల లో ఆర్థికంగా వెనుకబ డిన పేదల కూడా రిజర్వేషన్లను కల్పించి ఈ సమాజంలో ప్రతి ఒక్కరూ సమాన హక్కులతో సమాన ఫలాలు పొందాలని తన జీవితాన్ని త్యాగం చేసినటువంటి మహానుభా వుడు భారతరత్న బాబాసాహెబ్ అంబేద్కర్ గారిని రంగా కిరణ్ సోషల్ మీడియాలో కించపరచడం అవమానపరచడం భారత రాజ్యాం గాన్ని అవహేళన చేయడం అమా నుషం ఆటవికంఅనాగరికం అప్ర జాస్వామికం నీచమైన హీనమైన చర్య అని వెంటనే అతను తన తప్పు తెలుసుకొని జాతికి క్షమాపణ చెప్పకపోతే పెద్ద ఎత్తున ఆందోళన లు చేపడతామని భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు మద్దెల శివ కుమార్ డిమాండ్ చేశారు 22 03 2021 నాడు సాయంత్రం స్థానిక బస్టాండ్ వద్ద గల సంఘ కార్యాలయంలో ఏర్పాటుచేసిన అత్యవసర సమావే శానికి మద్దెల అధ్యక్షత వహించి మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబే ద్కర్ లేకపోతే భిన్నత్వంలో ఏకత్వం గల ఈ భారతదేశం భిన్న ఆచా రాలు సాంప్రదాయాలు సంస్కృతులు కులాలు మతాల తో సహజీవనం చేసే వారు కాదని దేశ సమగ్రతకు అభివృద్ధికి బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే మార్గదర్శక త్వాన్ని చూపిస్తుందని మద్దెల అభివర్ణించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ ఒక వ్యక్తి కాదని వ్యవస్థ అని కుల వాది కాదని కుల నిర్మూలన వాది అని సమతా వాది అని రాజనీతిజ్ఞుడు అని గొప్ప పరిపాలనాదక్షుడు అని మానవతా వాది అని మద్దెల కొనియాడారు ఒక జాతీయ పార్టీలో బాధ్యతగల వ్యక్తిగా ఉన్న రంగా కిరణ్ ఒక స్థానిక టీవీ ఛానల్ కు అధిపతిగా ఉన్న రంగా కిరణ్ ఒక విద్యాధికు లైన రంగా కిరణ్ కుల దురహం కారం తో ఈ విధంగా ప్రేలాపనలు చేయడం సూర్యునిపై ఉమ్మి వేస్తే అది తన మీద పడుతుందని నిజాన్ని గ్రహించి వెంటనే జాతికి క్షమాపణ చెప్పాలని లేకపోతే అంబేద్కర్ లిస్టులను అభ్యుదయ వాదులను దళిత సంఘాలన్నింటిని ప్రజా సంఘాలను పెద్ద ఎత్తున సమీక రించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టి చట్టపరమైన చర్యలు కూడా సిద్ధ పడతామని ఈ సందర్భంగా మద్దెల హెచ్చరించారు ఈ అత్యవసర సమావేశంలో మద్దెల తో పాటు సంఘం గౌరవాధ్యక్షులు సబ్బవరపు మధుసూదన్ చిన్ని ఉ పాధ్యక్షులు అంతోటి పాల్ నాయ కులు లావుడియా సత్యనారాయణ దేవయ్య పి సురేందర్ రఘు అంతోటి రాజు జోసఫ్ తోత కుమార్ తదితరులు పాల్గొన్నారు

# సిపిఎం జనచైతన్య పాదయాత్రను జయప్రదం చేయండి




**వలిగొండ ప్రజాపాలన ప్రతినిధి :** సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చేరుపల్లి సీతారాములు పిలుపు జిల్లా సమస్యలపై పోరాడేందుకు నిర్వహిస్తున్న సిపిఎం పాదయాత్ర జయప్రదం చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు పిలుపునిచ్చారు. ఈరోజు వలిగొండ మండల కేంద్రంలోని సాయి గణేష్ ఫంక్షన్ హాల్ లో సిపిఎం మండల కమిటీ సభ్యులు ఏలే కృష్ణ అధ్యక్షతన నిర్వహించిన మండల స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు అనేక రకాల హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు ముఖ్యంగా దళితులకు 3 ఎకరాల భూమి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు లాంటి అనేక హామీలు ఇచ్చిన అన్నారు. ఆ ఆ హామీలను ఇప్పటి వరకు నడిచిన ఆరు ఏండ్లల్లో ఏమాత్రం అమలు చేయలేదన్నారు. జిల్లా కేంద్రంలో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అదేవిధంగా మండల కేంద్రాల్లో 30 పడకల ఆసుపత్రిల ఏర్పాటు హామీలకే పరిమితమైంద న్నారు. మూసి కాలుష్యం వల్ల జిల్లాలో నాలుగు మండలాల్లో ఉ న్నటువంటి ప్రజలందరూ తీవ్రమైన అటువంటి ఇబ్బందులు పడుతు న్నారని కాలుష్యంతో గ్రామీణ ప్రాంతాలు కాలుష్యం అయ్యాయని. ప్రభుత్వం కాలుష్యాన్ని అరికట్టే డబ్బులు పూర్తిగా విఫలమైందని అన్నారు. జిల్లాలో గత 2004 సంవత్సరంలో ప్రారంభమైన బునాదిగాని కాల్వ పిల్లాయిపల్లి కాల్వ. బొల్లాపల్లి కాలువ ధర్మారం కాలువలు నేటికీ పూర్తి చేయలేక పోయారా అన్నారు. ఈ కాలంలో దాదాపు మూడు ప్రభుత్వాలు నలుగురు ఎమ్మెల్యేలు మారిన ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉ ందని అన్నారు. నాటి నుండి నేటి వరకు జిల్లా సమస్యలపైన పోరాడాలని కేవలం సిపిఎం మాత్రమే అన్నారు. భవిష్యత్తులో ఆ పోరాటాన్ని మరింత ఉధృతం చేసేందుకు జిల్లావ్యాప్తంగా ఈ పాదయాత్ర నిర్వహించి జిల్లా ప్రజలు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను గుర్తించడం జరుగుతుందని ఆయన అన్నారు. అందుకే ఈ జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న పాదయాత్ర చేయాలని పిలుపునిచ్చారు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వేముల మహేందర్, మండల కార్యదర్శి మద్దెల రాజయ్య సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్పంగి స్వామి, సిపిఎం సీనియర్ నాయకులు కొమ్మిడి లక్ష్మారెడ్డి, సిపిఎం మండల కమిటీ సభ్యులు తుర్కపల్లి సురేందర్, పట్టణకార్యదర్శి కూర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు కొండె కిష్టయ్య గాజుల ఆంజనేయులు, వాకిటి వెంకటరెడ్డి, చీర్క శ్రీశైలం రెడ్డి శాఖా కార్యదర్శులు, ప్రజా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సంక్షేమ అభివృద్ధికి కృషి చేస్తా

## ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి



**మేడిపల్లి, మార్చి22 (ప్రజాపాలన ప్రతినిధి) :** జర్నలిస్టుల సంక్షేమ, అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి పేర్కొన్నారు. ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా హబ్సిగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతన కమిటీ అధ్యక్షులు దొంతుల వెంకట్ రామ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కూ కుట్ల నరోత్తం రెడ్డి మరియు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల తిరుపతి రెడ్డి , ఉపాధ్యక్షులు ఎం. సురేష్, ఏవి. శ్రీధర్ రావు, కోశాధికారి ఆర్ యాదగిరి గౌడ్, సహాయ కార్యదర్శులు జి. శివాజీ, గుత్తి శేఖర్ కార్యనిర్వాహక కార్యదర్శి రాజు, సలహాదారులు కొలనుపాక చంద్రమౌళి, పల్లా మహేందర్ రెడ్డి, మరియు జర్నలిస్టులు శ్రీశైలం, కిషోర్ పాల్గొన్నారు.

# కాలనీవాసులు సమస్యలపై మంత్రికి వినతి



**బాలాపూర్, ప్రజాపాలన న్యూస్ :** 36వ డివిజన్ కాలనీవాసులు సమస్యలపై మంత్రికి వినతి సమర్పించారు. మీర్ పేట్ కార్పొరేషన్ లోనీ 36వ డివిజన్ కాలనీవాసులు దుర్వాసన, దోమల బెడద విపరీతంగా పెరిగిందిని అన్నారు. మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో36వ డివిజన్ లో ఉన్న ఎస్ ఎల్ ఎన్ ఎస్ కాలనీ వాసులు సమస్యలతో సతమతం అవుతున్నామని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డికి చెప్పారు. కాలని ప్రెసిడెంట్, ట్రంక్ లైన్ పనులు మూలంగా మంత్రాల చెరువు అవుట్ లైట్ మోయడం వల్ల దుర్వాసనతో దోమలు బెడద చాలా ఎక్కువ ఉందని చెప్పారు. ఈ డివిజనలో రోడ్లు పూర్తిగా దెబ్బతిని పాడైపోయినవి. అదేవిధంగా రోడ్లు ఊడ్చే వారు కూడా లేకుండా పోయారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇక్కడున్న శానిటేషన్ అధికారులకు కూడా మా బాధ తెలియజేశామని. మితుల నగర్ లో జరుగుతున్న ట్రంక్ లైన్ పండ్లలో వేగం పెంచి వెంటనే పనులు పూర్తి చేయాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కి వినతి పత్రాన్ని అందజేశారు. అలాగే మంత్రాల చెరువు సుందరీకరణ పనులు తొందరగా ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బీసీ సెల్ దిండు భూపేష్ గౌడ్, కాలనీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక సాయం అందజేత



**వలిగొండ ప్రజా పాలన ప్రతినిధి :** మండల పరిధిలోని ఎం తుర్కపల్లి గ్రామంలో సోమవారం రోజున ఇటీవల మరణించిన చిలుగురి నర్సీ రెడ్డి కుటుంబానికి పైళ్ల ఫౌండేషన్ ద్వారా 5వేల రూపాలయలు ఎంపీటీసీ తుమ్మలవెంకట్ రెడ్డి చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెలిమినేటి సత్యనారాయణ, మండల యూత్ కమిటీ ఉపాధ్యక్షుడు ఉప్పుల మల్లేష్, మండల నాయకులు రాధారపు మల్లేశం, వనం చంద్రమౌళి, మర్రి గోపాల్, తుమ్మల చంద్రారెడ్డి, మాసంపల్లి తిరుమలేష్, సల్ల మత్స్యగిరి, బెల్లి నర్సింహా, గ్రామశాఖ అధ్యక్షుడు ఉప్పుల స్వామి, ఉపాధ్యక్షుడు సల్ల మల్లయ్య, కార్యదర్శి బట్టు నవీన్, గ్రామశాఖ యూత్ అధ్యక్షుడు బట్టు నరేష్, పార్టీ కార్యకర్తలు తుమ్మల సతిరెడ్డి, తుమ్మల నరసీమయ్య. ముంత మచ్చగిరి, బట్టు బిక్షం, యాస శ్రీనివాస్ రెడ్డి, మర్రి చంద్రయ్య, మాసంపల్లి సత్యనారాయణ, పాక రాజయ్య, జక్కుల మల్లయ్య, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విజేతలకు బహుమతులు అందజేత






**బాలాపూర్, ప్రజాపాలన (ప్రతి నిధి) :** మంత్రి తనయుడు కౌశిక్ రెడ్డి ఏ వై ఆర్ గ్రౌండ్ లో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఏనుగు రామ్ రెడ్డి తన తండ్రి జ్ఞా పకార్థం కి!శే! ఏనుగు రామచం ద్రారెడ్డి స్మారక దినమున క్రికెట్ టోర్నమెంట్లో ప్రథమ, ద్వితీయ వారికి మెమోరియల్ ట్రోపే ని అతిధులు అందజేశారు. బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి లోని 24 వ డివిజన్ కార్పొరేటర్ ఏనుగు రామ్ రెడ్డి ఆధ్వర్యంలో తన తండ్రి జ్ఞాపకార్థనీ క్రికెట్ టోర్న మెంట్ మెమోరియల్ ట్రోపి సోమవారం ఏ వై ఆర్ గ్రౌండ్ లో విద్యా శాఖ మంత్రి తనయుడు యువ నాయకుడు కౌశిక్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎక్స్ ఎంపీటీసీ సంరెడ్డి వెంకట్ రెడ్డి, ఎక్స్ సర్పంచి ముత్యాల కృష్ణ, మీర్ పేట్ టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అర్కాల కామేశ్వర్ రెడ్డి, క్రికెట్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

# పంజాగుట్ట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చెయ్యాలి

*: బీజేపీ ఎస్టీ మోర్చా నాయకుడు దేవావత్ భరత్ సింగ్.*



**అమీర్ పేట (ప్రజాపాలన ప్రతినిధి ):** బహుజనుల ఆరాధ్యదైవం డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని పంజాగుట్ట చౌరస్తాలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు రాష్ట్ర బీజేపీ ఎస్టీ మోర్చా నాయకుడు దేవావత్ భరత్ సింగ్. స్థానిక బాపునగర్ బస్తీలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లపై సవతి ప్రేమ ప్రదర్శిస్తుందని విమర్శించారు. ఎస్సీ లకు ఇంతవరకు సబ్సిడీ రుణాలు మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. ఆసరా పింఛన్లు అధికార పార్టీ కి చెందిన వారికే దక్కుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇకనైనా బహుజనుల సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు, త్వరలో పంజాగుట్ట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చెయాలని బీజేపీ ఎస్టీ మోర్చా డిమాండ్ చేస్తుందని తెలిపారు.

# అంతర్జాతీయ జల దినోత్సవం వేడుకలు




**బాలాపూర్: (ప్రతినిధి) ప్రజా పాలన న్యూస్ :** ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో నీటి అవసరం కూడా భవిష్యత్ తరాలకు ఇచ్చే నిధి ని మేయర్ అన్నారు.

బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ లోని అల్మాసగుడా లో రామిడి స్వరూప భీంరెడ్డి స్వచ్ఛంద సంస్థ చైర్మన్ రామిడి శూర కర్ణ రెడ్డి ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవానికి ముఖ్య అతిథులు కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి మాట్లాడుతూ.... నీటిని ప్రతి ఒక్కరూ పొదుపుగా వాడాలని అలాగే నీరు కలుషితం కాకుండా చూడాలని ఆమె కోరారు. అదే మన భవిష్యత్తు తరాలకు ఇచ్చే నిధి ఆని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో జనాభా పెరుగుతున్న నేపథ్యంలో నీటి అవసరం కూడా పెరుగుతుంది కాబట్టి ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి నీటి సాంద్రత తగ్గకుండా ఉండేటట్లు ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని అన్నారు. అలాగే చెట్లు నాటి ప్రకృతిని కాపాడుకోగలిగినపుడే భవిష్యత్తులో నీరు, గాలి సమృద్ధిగా దొరుకుతాయాని సభా ముఖంగా చెప్పారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇబ్రమ్ శేఖర్, కార్పోరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేషన్ కార్పొరేటర్లు రామిడి మాధురి వీర కర్ణ రెడ్డి, బంగారు అనిత ప్రభాకర్, గౌర రమాదేవి శ్రీనివాస్, గడ్డం లక్ష్మారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు రఘునందన చారి, సినీ నటుడు మానస్, సంస్థ చైర్మన్ రామిడి శూర కర్ణ రెడ్డి, నాయకులు శ్రీకాంత్ గౌడ్, రామిడి తుఫాన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రిసార్ట్ దగ్గరలో సముద్రం ఒడ్డుకు కొట్టుకొచ్చిన మృతదేహాలు



వేటపాలెం, ప్రజాపాలన: అదివారం సాయంత్రం 4.30 నిమిషాల సమయంలో వేటపాలెం మండల పరిధిలోని రివేరా రిసార్ట్ దగ్గరలో సముద్ర తీరంలో మృతదేహాలు కొట్టుకురావడం జరిగింది. వేటపాలెం ఎస్ఐ కె కమలాకర్ కథనం ప్రకారం గుంటూరు జిల్లా ఎటి అగ్రహారంకు చెందిన 5గురు బిటెక్ విద్యార్థులు సముద్ర స్నానానికి వచ్చారు, వారిలో 3గురు ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతు అవ్వడం జరిగినదన్నారు. దగ్గరలో ఉన్న మెరైన్ పోలీసులు జస్వంత్(22), మానస రెడ్డి(19), లను కపాడగా మొగిలి ఉషా(20), భరత్ సూర్య రెడ్డి(20), గట్టు మహేష్(20) లు గల్లంతు అయ్యారన్నారు. వారిలో ఉషా, భరత్ ల మృతదేహం లభ్యం అయ్యాయని మహేష్ మృతదేహం కొరకు గాలింపు చర్యలు జరుగుతున్నట్లు తెలిపారు.

## తెలుగు సాహిత్యం ఎనలేనిది



వేటపాలెం, ప్రజాపాలన: తెలుగు సాహిత్యం ఎనలేనిదని, ఎందరో కవులు కృషి మరువలేనిదని ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి అన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా వేటపాలెంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా కవితా ధోరణి మారుతున్నదని, ఆధునిక కాలంలో మహాకవి శ్రీశ్రీ, గురజాడ, కందుకూరి వీరేశలింగం తదితరులు తమ రచనల ద్వారా సమాజంలో మార్పు తెచ్చారని, నూరేళ్ళ సినీ చరిత్రలో ఎందరో రచనలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారని అన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక ప్రతినిధులు పనామా లోహియా, పసుపులేటి వసంతకుమారి, గుర్రాల శేషుకుమారి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ వాటర్ దినోత్సవం సందర్భంగా ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రతిజ్ఞ



**మధిర, మార్చి 22 ప్రజా పాలన ప్రతినిధి :** మధిర ప్రపంచ వాటర్ దినోత్సవం సందర్భంగా ఈరోజు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెండెం లలిత ఎంపిడిఓ విజయ భాస్కర్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారి నాగేశ్వరరావు ప్రజా ప్రతినిధులు అధికారులు, కోటేశ్వరరావు రావూరు శ్రీనివాసరావు అరిగె శ్రీనివాసర్జావు పాల్గొన్నారు.

## గరిడేపల్లి వెంకటేశ్వరరావు కుమార్తె కుమారుడుకు పుష్ప అలంకరణ



**మధిర, మార్చి 22 ప్రజా పాలన ప్రతినిధి :** ఈరోజు మధిర మండలం మల్లారం గ్రామంలో సిపిఐ మధిర మండల నాయకులు గరిడేపల్లి వెంకటేశ్వరరావు కుమార్తె కుమారుడు పుష్ప అలంకరణ పంచలు కార్యక్రమానికి హాజరై ఆశీర్వదిస్తున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లవరం ఎంపీటీసీ మందడపు నాగేశ్వరరావు గారు రాణి గారు సిపిఐ మధిర మండల కార్యదర్శి వూట్ల కొండల రావు గారు మండల పట్టణ సహాయ కార్యదర్శులు చావా మురళి కృష్ణ పెరుమలపల్లి ప్రకాష్ రావు ఖమ్మం జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్ అన్నవరపు సత్యనారాయణ కొండ తదితరులు హాజరై ఆశీర్వదించడం జరిగింది.

## అసెంబ్లీ ముట్టడికి వెళుతున్న నేతల అరెస్టు



**మధిర, మార్చి 22 ప్రజా పాలన ప్రతినిధి :** నిరుద్యోగ భృతి కల్పిస్తామని బడ్జెట్ లో ఈ విషయం ను విస్మరించిన ప్రభుత్వం కు బుద్ధి చెప్పాలనిఈ రోజు స్టేట్ యూత్ కాంగ్రెస్ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి హైద్రాబాద్ బయలుదేరి వేళ్ళుచుండగా మధిర నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు టుమాటి నవీన్ రెడ్డి మధిర మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అద్దంకి రవికుమార్ ను మధిర రురల్ రమేష్ గారు అరెస్ట్ చేసి రురల్ పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# మావోయిస్టులతో సంబంధం ఉన్న వ్యక్తి అరెస్టు



**క్యాతన్ పల్లి, 21 మార్చి, ప్రజాపాలన ప్రతినిధి :** మంచిర్యాల జిల్లా కేంద్ర లోని క్యాతన్ పెల్లి కి చెందిన విద్యావంతుల వేదిక అద్యక్షుడు గురిజాల రవీందర్ రావు ను మావోయిస్టులతో సంబందాలు కొనసాగిస్తున్నట్లుగా బావించి ఆయనను పోలీసులు అరెస్టు చేశారు. ఆయన ఇంట్లో పోలీసులు సోదాలు చేసి మావోయిస్టులకు సంబంధించిన సాహిత్యం, కీలక సమాచారం స్వాధీనం చేసుకున్నట్టు రామగుండం పోలీసు కమీషనర్ వి. సత్యనారాయణ తెలిపారు. రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్ స్టేషన్లో రామగుండం పోలీస్ కమీషనర్ వి. సత్యనారాయణ, మంచిర్యాల డిసిపితో కలిసి ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అరెస్టు కు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా సి.పి మాట్లాడుతూ పట్టణ పోలీస్ స్టేషన్ పరిధి గద్దెరాడగిలో రెస్టారెంట్ నడుపుతున్న ఓ వ్యక్తి ఇంట్లో నమ్మదగిన సమాచారం మేరకు సోదాలు నిర్వహించినట్లు పేర్కొన్నా రు. గురిజాల రవీందర్ రావు గతంలో మావోయిస్టు కార్యకరాపా లలో పాల్గొని కోర్టులో లొంగిపోయాడని తెలిపారు. అతని వద్ద నుండి మావోయిస్టు పార్టీకి సంబంధించిన వివిధ రకాల సాహిత్యంతో పాటు రెండు మెమోరీ కార్డులు స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు. రవీందర్ రావు క్యాతన్పల్లి గ్రామపంచాయితీ ఉన్న సమయంలో సర్పంచ్ గా పనిచేశాడని తెలిపారు. 1978 సంవత్సరంలో యువకునిగా ఉన్న సమయంలో ఉత్తర తెలంగాణలో రాడికల్ యూత్ లో పనిచేసాడని అన్నారు. 1981లో సింగరేణి కార్మిక సమాఖ్యలో మొట్టమొదటి సెక్రెటరీ జనరల్ గా పనిచేశారని తెలిపారు. 1981 నుండి 1985 వరకు తన కార్యకలాపాలు నిర్వహించాడని, అనంతరం పోలీసులు పట్టుకునే సమయానికి లొంగిపోయినట్లు తెలిపారు. తెలంగాణ విద్యావంతుల వేదిక అధ్యక్షుడిగా ఉన్నట్లు తెలిపారు. ఆదివాసీల సంఘాలు, డిటిఎఫ్, విద్యా సంస్థలకు సంబంధించిన సంఘాలతో పాటు వివిధ సంఘాల పట్ల మావోయిస్ట భావాజాలాన్ని విస్తరింపచేసేవిధంగా ఉండేవాడని తెలిపారు. ఇది కొనసాగుతుండగా విస్తరాకు పేరిట హెూటల్ వ్యాపారం మొదలు పెట్టినట్లు తెలియజేశారు. మొత్తంగా వృత్తికి, ప్రవృత్తికి ఎటువంటి సంబంధం లేకుండా అర్బన్ మావోయిజంగా పనిచేసినట్ల తెలియజేశారు. గత సంవత్సరం నవంబర్ లో మావోయిస్టు పార్టీలో పనిచేసే సెంట్రల్ కమిటి మెంబర్ వారణాసి సుబ్రహ్మణ్యం తో పాటు అతని భార్యకు 20 రోజుల పాటు షెల్టర్ ఇచ్చినట్ల తమ ఇన్విస్టిగేషన్లో తెలియజేసినట్లు పేర్కొన్నారు. అర్బన్ ఏరియాలో మావోయిస్టు భావాజాలాల వ్యాప్తిని కొనసాగించేవాడని తెలిపారు. అందుగకు గాను గురిజాల రవీందర్ ను అరెస్టు చేసినట్ల తెలియజేశారు. చట్టపరంగా 120 సెక్షన్లతో పాటు వివిధ సెక్షెన్లలో కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏసిపి రహెమాన్, మందమర్రి సిఐ ఎడ్ల మహేష్, రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై కె. రవిప్రసాద్, కాసిపేట ఎస్సై రాములు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తాండూర్ ప్రథమ పౌరురాలుపై చర్యలు తీసుకోవాలి

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ పట్టభద్రుల అభ్యర్థి చిన్నారెడ్డి



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి మార్చి 22 ( ప్రజా పాలన ) :** ఈ నెల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓటు వేసిన తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న పరిమల్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి చిన్నారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ముందు భాగంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పరిగి మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి తాండూరు కాంగ్రెస్ ఇంచార్జ రమేష్ మహారాజ్ తాండూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్ కాంగ్రెస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వరాల శ్రీనివాస్ రెడ్డి జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు రత్నారెడ్డి యువజన కాంగ్రెస్ నాయకులు జొన్నల రవిశంకర్ చావల శ్రీనివాస్ ముదిరాజ్ లతో కలిసి ధర్నా నిర్వహించి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓటు వేసిన తాండూరు మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న తాటికొండ పరిమల్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల ( 14 మార్చి 2021 ఆదివారం) 14న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో తాండూరు పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 281 పోలింగ్ కేంద్రంలో తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ దొంగ ఓటు వేశారని పేర్కొన్నారు. తన తోటి కోడలు పేరిట ఉన్న ఓటును చైర్ పర్సన్ వినియోగించుకోవడం సహేతుకం కాదని వివరించారు. తాండూర్ ప్రథమ పౌరురాలుగా ఎన్నుకోబడిన మున్సిపల్ చైర్ పర్సన్ దొంగ ఓటు వేయడం టిఆర్ఎస్ ప్రభుత్వ అరాచక పాలనకు నిదర్శనమని ఎత్తి చూపారు. తనకు పట్టభద్రుల ఎన్నికల జాబితాలో ఓటు హక్కు లేకున్నా తన తోటి కోడలు ఓటును చైర్ పర్సన్ స్వప్న వినియోగించుకోవడం తన పదవికే కళంకమని విమర్శించారు. 283 పోలింగ్ బూతులో 528 వరుస సంఖ్య కు సంబంధించి ఓటర్ జాబితాలో స్వప్న భర్త అశ్విన్ తాటికొండ అనే పేరుతో నమోదు చేయబడింది అని పేర్కొన్నారు. తన తోటి కోడలు పేరు కూడా స్వప్న కావడంతో ఆమె ఓటును చైర్ పర్సన్ వినియోగించుకున్నందున ఆమెపై 171డి, 171ఎఫ్, ఐపిసి సెక్షన్ 5 కింద, క్రిమినల్, చీటింగ్ కేసు బుక్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాను దొంగ ఓటు వేసినా కూడా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డితో కలిసి తాను కూడా ఓటు హక్కు వినియోగించుకున్నట్లు ఫోటోలు దిగడం అమానుషమని వివరించారు. ప్రజాస్వామ్యబద్ధంగా రాజ్యాంగబద్ధంగా జరగాల్సిన ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికల్లో టిఆర్ఎస్ ప్రభుత్వం కుట్రపూరితంగా రాజకీయ దురహంకారంతో ఎన్నికలు నిర్వహించారడానికి నిదర్శనం అని కొనియాడారు.

## కరోనా పట్ల ప్రజలు జాగ్రత్త వహించండి



**మధిర మార్చి 22 ప్రజా పాలన ప్రతినిధి** ఈ సంవత్సర కాలం నుంచి ప్రజల్ని ఎంతో రకంగా ఇబ్బంది పెడుతూనే మరలా సెకండ్ వేవ్ కు తయారైంది. ఈ కరోనా నుండి తప్పించుకొని ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఉండి మాస్కులు ధరించి మీ ప్రాణాన్ని మీరే కాపాడుకోండి సామాజిక దూరం పాటిస్తూ నియమ నిబంధనలు పాటిస్తూ ప్రభుత్వ సూచనలు అనుసరిస్తూ మీ జాగ్రత్త ను మీరే పాటించి ప్రజలందరికీ కూడా ఈ నియమ నిబంధనలను తెలుపుతూ మీ ఆరోగ్యం మరియు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడవలసిందిగా ఆ భగవంతున్ని కోరుకుందాము సరిగ్గా సంవత్సరం క్రితం మధిరలో లాక్ డౌన్ వీడియో మీ ముందుంచుతున్నాను మరల తిరిగి ఈ పరిస్థితి రాకుండా మధిర ప్రజల్లో చైతన్యం కలిగి అందరూ కలిసికట్టుగా మాస్కులు ధరించి సామాజిక దూరం పాటించి ఈ కరోనా ను తరిమి తరిమికొడదాం మీసేవ సేవకుడిగా చిరు వ్యాపార సంఘం అధ్యక్షుడిగా మరియు విలేకరి ప్రజా పాలన అండ్ స్నేహ టీ వి మధిరనియోజకవర్గ ఇంచార్జ్ వసుపులేటి నాగేంద్ర శ్రీనివాసరావు కోరుకున్నారు

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ




మేడిపల్లి, మార్చి 22 (ప్రజాపలన ప్రతినిధి) : ఉప్పల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి చేతులమీదుగా అందజేశారు. చిల్కానగర్ డివిజన్ చెందిన కే యాదయ్యకు 56,000/- టీ. మల్లేష్ 50,000/- చర్లపల్లి డివిజన్ భరత్ నగర్ కు చెందిన బిక్షపతికి ఒక లక్ష సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్వోసీ పత్రాన్ని ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో చిలకా నగర్ కార్పొరేటర్ బన్నల గీత ప్రవీణ్ ముదిరాజ్ డివిజన్ ప్రెసిడెంట్ బన్నల ప్రవీణ్ ముదిరాజ్, టీఆర్ఎస్ నాయకులు గరిక సుధాకర్, రాణి రెడ్డి పాల్గొన్నారు

## మండల పరిషత్ కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



**మధిర, మార్చి 22 ప్రజాపాలన ప్రతినిధి :** మధిర ఎంపిడిఓ కార్యాలయ ఆవరణంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన అనంతరం ఎంపీపీ మొండెం లలిత మాట్లాడుతూ మండల పరిస్థితులకు ఎన్నడూ లేని విధంగా బడ్జెట్లో రూ.500 కొట్ల నిధులు కేటాయించిన సీఎం గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రతి గ్రామం అభివృద్ధిలో దూసుకుపోతున్న తరుణంలో ఈ నిధులు ప్రతి పంచాయతీకి ఎంతగానో ఉపయోగపడతాయని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుడుముల విజయ భాస్కర్ రెడ్డి, ఆత్మకమిటీ చైర్మన్ రంగిశెట్టి కోటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తరు నాగేశ్వరరావు, మండల అధ్యక్షులు రావూరి శ్రీనివాసరావు, కార్యదర్శి బొగ్గులు భాస్కర్ రెడ్డి, కనుమూరి వెంకటేశ్వరావు, అల్లినగరం ఎంపీటీసీ చిలక బత్తిని జయరాజు, మాటూరు ఎంపీటీసీ అడపాల వెంకటేశ్వరరావు, సిరిపురం ఎంపిటిసి నంద్రు కుమారి, ఆత్కూరు ఎంపీటీసీ పాండు రంగారావు, కుమారి,ఎస్.డీ. కాదర్ పాల్గొన్నారు.

## ప్రపంచ వాటర్ దినోత్సవం సందర్భంగా ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రతిజ్ఞ



**మధిర మార్చి 22 ప్రజా పాలన ప్రతినిధి :** మధిర ప్రపంచ వాటర్ దినోత్సవం సందర్భంగా ఈరోజు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మెండెం లలిత ఎంపిడిఓ విజయ భాస్కర్ రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ చిత్తారి నాగేశ్వరరావు ప్రజా ప్రతినిధులు అధికారులు, కోటేశ్వరరావు రావూరు శ్రీనివాసరావు అరిగె శ్రీనివాసర్జావు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో ఉన్న కుటుంబానికి నిత్యావసర సరుకులు పంపిణీ



**మధిర, ప్రజాపాలన ప్రతినిధి :** మున్సిపాలిటీలోని రామాలయం రోడ్డులో ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ నివసిస్తున్న పసుపులేటి వీరబాబువ్యక్తి ఇటీవల అనారోగ్యానికిగురై ఇబ్బంది పడుతున్న విషయాన్ని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు మిర్యాల రమణ గుప్తా గారు కాంగ్రెస్ నాయకులు మరియు అన్న ఫౌండేషన్ చైర్మన్ మేళం శ్రీనివాస్ యాదవ్కు తెలియజేయగా వారు ఏర్పాటు చేయగా ఈరోజు లినిత్యావసర సరుకులులి పంపిణీ చేయడం జరిగిందిఈ కార్యక్రమంలో మధిర పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు బి ఉద్దండయ్యా పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు గద్దల లాలయ్య ఎన్ టి యు సి పట్టణ అధ్యక్షులు షేక్ బాజీ డివిజన్ అధ్యక్షులు అంబర్ పేట రామారావు తలుపుల వెంకటేశ్వర్లు ఆదిమూలం శ్రీనివాస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు కోట డేవిడ్ గద్దల విజయ్ నాగరాజు డివిజన్ అధ్యక్షులు మాగం ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు రహీమ్ దోర్నాల సునీల్ వెంకట రమణ నాయక్ రాజేందర్ సజ్జ ప్రసాద్ షేక్ గౌస్ ఉద్దీన్ (షన్ను) తదితరులు పాల్గొన్నారు.

